



ఒక్కరోజే రూ.81.54 లక్షల ఆదాయం
భక్తులతో పోటెత్తిన వాడపల్లి క్షేత్రం 6

రేపు, ఎల్లుండి కలెక్టర్ల సదస్సు

సదస్సుకు హాజరవుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): అమరావతిలో సోమ, మంగళవారాల్లో కలెక్టర్ల సదస్సు నిర్వహిస్తున్నారు. దీనికి కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ హాజరవుతున్నారు. ఈ సదస్సులో సీఎం చంద్రబాబు స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్యాలపై కలెక్టర్లకు వివరిస్తారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇది నాలుగో సదస్సు. గత సదస్సులో తీసుకున్న నిర్ణయాలు, వాటిని ఎంతవరకు అమలు చేశారో వంటి ప్రగతిపై సమీక్షిస్తారు. కాకినాడ జిల్లాలో అమలు చేస్తున్న అభివృద్ధి పనులు పురోగతి, ప్రభుత్వ పథకాల పనితీరు, పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలపై కలెక్టర్ షాన్‌మోహన్ సీఎం సదస్సులో ప్రజంటేషన్ ఇస్తారు. అలాగే భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికపై చర్చిస్తారు.



ఉచితమంటే.. ఊరుకుంటారా!

బస్ ఉచితమంటే ఊరుకుంటారా.. ఊరూరా తిరిగేయరూ... ప్రస్తుతం మహిళలు అదే చేస్తున్నారు.. గుంపులు.. గుంపులుగా పుణ్యక్షేత్రాలు చుట్టి వచ్చేస్తున్నారు.. ఈ చిత్రంలోనే చూడండి.. ఇది అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంలోని ఆర్టీసీ బస్టాండ్.. శనివారం సెలవుదినంకావడంతోపాటు వాడపల్లికి వచ్చిన మహిళా భక్తజనంతో ఇలా కిటకిటలాడింది. మహిళా ప్రయాణికులు ఇంత భారీ స్థాయిలో పోటెత్తడంతో ఆర్టీసీ కాంప్లెక్స్ పూర్తిగా నిండిపోయింది. ఆ దృశ్యమే ఇది... - రావులపాలెం

రావులపాలెంనకు చెందిన అబ్బాయికి నల్లజర్లకు చెందిన యువతితో పెళ్లి చూపులు జరిగాయి.. ఒకరికొకరు నచ్చారు.. కట్నం రూ.3 లక్షలు ఇస్తామని చెప్పడంతో ఓకే అనుకున్నారు.. మరి బంగారం ఏం పెడతారని ఇరు తరుపు బంధువులు రంగంలోకి దిగారు. అమ్మాయికి 3 కాసులు పెడతామని వధువు తరపువారు చెప్పారు.. 3 కాసులకు ఏం వస్తుంది.. 10 కాసులు పెట్టాలని డిమాండ్ చేశారు. 10 కాసుల బంగారానికి 10 లక్షలు అవుతుందని అంత పెట్టలేమని 3 కాసులే పెడతామని వధువు తరపు వారు చెప్పారు.. మళ్లీ కబురుపెడతామంటూ వరుడి తరపు వారు వచ్చేశారు..

పిఠాపురానికి చెందిన యువతీయువకులు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు.. ఇద్దరు దగ్గర బంధువులే కావడంతో వివాహం నిశ్చయించారు. అయినప్పటికి బంగారం ఎంత పెట్టాలనే విషయంలో మాత్రం ఎవరు వెనక్కి తగ్గలేదు. మాకు కట్నం ఎంతిచ్చినా పర్వాలేదు. బంగారం మాత్రం మేము అడిగినంత పెట్టాల్సిందే అంటూ పట్టుబట్టారు. పెళ్లికూతురికి అమ్మాయి తరపు వారు 20 కాసులు, పెళ్లి కొడుకు తరపు 10 కాసుల బంగారు ఆభరణాలు పెట్టేలా ఒప్పందం కుదిరింది. పెళ్లికొడుక్కి ఐదు కాసులు పెట్టాలని షరతు పెట్టారు. బంగారం విషయంలో అంగీకారానికి వచ్చి కట్నం మాత్రం అమ్మాయి తరపు వాళ్ల ఇష్టాఇష్టాలకు వదిలేశారు.

రాజమహేంద్రవరానికి చెందిన అమ్మాయికి పాలకొల్లుకు చెందిన అబ్బాయితో పెళ్లి మాటలు జరిగాయి.. వరుడు తరపు వాళ్లు బంగారం ఎంత పెడతారని వధువు తరపు వారిని అడిగారు.. 10 కాసులు పెడతామని చెప్పారు.. మీరెంత పెడతారని వరుడు తరపు వారిని అడిగితే 8 కాసులు అన్నారు.. ఇరు పక్షాల వారు 18 కాసులు వధువుకి పెట్టేలా అంగీకరించారు. అయితే వరుడికి 5 కాసులు బంగారం అడిగారు. అంత పెట్టలేమని 3 కాసులు పెడతామని వధువు తరపు వారు చెప్పారు.. 2 కాసులు పెట్టకపోతే సంబంధం వదిలేసుకోవడానికి సిద్ధమయ్యారు. చివరికి వధువు తరపు వారు తగ్గి 5 కాసులు పెట్టడానికి సుముఖత వ్యక్తం చేయడంతో పెళ్లి ఓకే అయ్యింది..



సుబ్బంపేట వద్ద కోతకుగురైన బీచ్‌రోడ్డు

ఉప్పాడలో కొనసాగుతున్న అలల ఉధృతి

- ధ్వంసమవుతున్న బీచ్ రోడ్డు

కొత్తపల్లి, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావం కారణంగా కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ తీరంలో కెరటాల ఉధృతి కొనసాగుతోంది. ఇప్పటికే ఉప్పాడ సమీపంలో కొత్తపట్నం, సుబ్బంపేట వద్ద బీచ్‌రోడ్డు అలల ఉధృతికి అగాధంలా మారింది. శనివారం ఉదయం కూడా ఉవ్వెత్తున అలలు ఎగసిపడుతూనే ఉన్నాయి. యథావిధిగా రంగంపేట మత్స్యకారుల ఇళ్లల్లోకి కెరటాలు చొచ్చుకొనిపోతున్నాయి. కోనపాపపేట గ్రామం ప్రారంభంలో రాకాసి అలల వేగానికి బీచ్‌రోడ్డు ఛిద్రమైంది. కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు శనివారం ఉప్పాడ, కోనపాపపేట తీర ప్రాంత గ్రామాల్లో పర్యటించారు. కోత నివారణకు చర్యల నిమిత్తం ఆర్అండ్‌బీ అధికారులతో చర్చించారు. పెద్దసైజు బండరాళ్లను డంప్ చేసేందుకు చర్యలు చేపట్టారు.

ఉప్పాడ సమీపంలో కొత్తపట్నం వద్ద కెరటాల ధాటికి ధ్వంసమైన బీచ్ రోడ్డు



ఆదివారం ప్రత్యేకం

కనకప్పు.. సింహాసనం!

పుత్తడిబొమ్మా.. అందనిదమ్మా..



(కాకినాడ/రాజమహేంద్రవరం/మండపేట /పిఠాపురం,ఆంధ్రజ్యోతి)

పెళ్లంటే..
పెళ్లంటే పందిళ్లు.. సందళ్లు..తప్పెట్లు..
తాళాలు.. తలంబ్రాలు.. ఇదంతా ఒకప్పుడు..
ఈ కాలంలో పెళ్లంటే.. కాసులు.. గ్రాములు..
కిలోలు..అంటే బంగారం ఎన్ని కాసులు పెడతారు దగ్గర ఆరంభమై ఎన్ని కిలోల వెండి పెడతారు దగ్గర కథ ముగిస్తున్నారు.. ఎందుకంటే ప్రస్తుతం బంగారం 10 గ్రాములు అక్షరాలా రూ.లక్ష దాటేసింది.. 10 కాసులు బంగారం పెట్టాలంటే రూ.10 లక్షలే.. బంగారం రాకెట్ వేగంతో పరుగులు తీస్తోన్న తరుణంలో వివాహాల్లో బంగారం పెట్టి పోతలు చుక్కలు చూపిస్తున్నాయి. పెళ్లి ఖర్చును మించి బడ్జెట్‌ను తలకిందులు చేస్తున్నాయి. అందానికి అందం ఈ పుత్తడిబొమ్మ.. అందరికీ అందకుండా పోయింది.

ఇంట్లో చిన్న వేడుకైనా పిసరంతైనా పసిడి కొనితీరాల్సిందే. పెద్ద పండుగలకు, వివాహాలకు బంగారం లేని వేడుకను ఊహించడం కష్టం. అంతలా మన జీవితాల్లో సువర్ణం ప్రత్యేక స్థానాన్ని సంపాదించు కొంది. ఎంత పేద వారి పెళ్లయినా కనీసం 10 గ్రాముల బంగారం కొలువుదీరాల్సిందే. ప్రస్తుతం పెరుగుతున్న ధరలు బంగారం కంటే ఎక్కువగా మెరుస్తున్నాయి. ఒకవైపు ఈనెల 23 నుంచి వివాహ ముహూర్తాలు ఉన్నాయి. బంగారం ధర గారం చేస్తూ దిగిరానంటోంది. దీంతో ఇంట్లో పెద్ద వాళ్లకు పెళ్లి తంతు, ఖర్చు కంటే పసిడి చింత ఎక్కువైపోయింది. పందిట్లో పడతుల ఒంటిపై పసిడి మెరుపు లొలుకుతూ ఉంటే ఆ కళే వేరు కదా మరి!

పెళ్లింట..బంగారమే!



పసిడి ధర ఎంత పరుగులు తీసినా వధూవరుల కుటుంబాలకు మాత్రం కనకం భారం తప్పడం లేదు. ధర ఎంతకు ఎగబాకినా బంగారం పెట్టిపోతల్లో రాజీ పడడం లేదు. కట్నం అయినా తగ్గించండి కానీ మా అబ్బాయికి పెట్టే బంగారం పెట్టాల్సిందే అంటూ వరుడు కుటుం బం.. మా పాపకు మీరేం బంగారం పెడతారంటూ వధువు కుటుంబం ఎవరికివారు ఆభరణాల్లో రాజీపడడం లేదు. పేద కుటుంబాల్లో వివాహం సమయాల్లో అమ్మాయి తరపున వధువుకు కాసు (8 గ్రాములు), మధ్యతరగతిలో 40 గ్రాములు, ఎగువ మధ్యతరగతి 250 గ్రాముల వరకు పెట్టిపోతలు పెడతారు. బడాబాబులు అయితే లెక్కేలేదు. ఇది కాకుండా వరుడికి మరికొంత చదివిస్తారు. ఇప్పుడు ధర ఎంత పెరిగినా పెట్టిపోతలు మాత్రం మారలేదు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వివాహాల్లో వధూవరుల కుటుంబాల్లో పెట్టిపోతలు నేటికీ కొనసాగుతున్నాయి. దిగువ మధ్యతరగతి కుటుంబాల్లో జరిగే వివాహాల్లో మాత్రం బంగారం పెట్టి పోతల్లో కోతలు వేయకుండా కట్నంలో కొంత తగ్గించుకుంటూ శుభకార్యాలు జరుపుతున్నారు.

కనకం.. చదివింపుల్లేవ్..

కొంతకాలం కిందట వేడుకల్లో బంగారం చదివించే వారు.. పెరిగిన ధరలతో ఇవన్నీ కనుమరుగవుతున్నాయి. ప్రస్తుతం నగదు చదివింపులతో సరిపెట్టేస్తున్నారు.. ప్రస్తుతం ఆభరణాల చదివింపులు మాయమైపోతున్నాయి.. సామాన్య మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారు పెళ్లి కోసం మూడు నాలుగు తులాల బంగారం కొనుగోలు చేసేవారు ఇప్పుడు ధర పెరగడంతో సగం అంటే రెండు తులాలకు పరిమితమవుతున్నారు. వెండి ధర భారీగా పెరగడంతో అటు వైపు సామాన్యులెవరు వెళ్లడం లేదు.కేవలం కాళ్లకు పట్టీలు, తప్ప వెండివైపు చూడడం లేదు.

- రికార్డు స్థాయిలో బంగారం ధరలు
- పెళ్లింట పెట్టలేక సతమతం
- చదివింపుల్లోనూ కనుమరుగు
- సామాన్య,మధ్యతరగతికి భారం
- కొనుగోళ్లకు దూరంగా జనం
- ఏడాదిలో రూ.50 వేల వరకూ తేడా



కొనగలమా!

బంగారం ధర అడ్డుఅదుపు లేకుండా పరుగులు తీస్తోంది. రికార్డు స్థాయిలో అందనంతగా పెరిగిపోతోంది.ఒక్క ఏడాది ధరలు డబులు పెరిగాయి. గతేడాది ఇదే సమయానికి 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.69 వేలు ఉండగా ప్రస్తుతం రూ.1,11,160లు ఉంది. 22 క్యారెట్లు 101900 ఉంది.గతేడాది కిలో వెండి రూ.50 వేల వరకు ఉండగా ప్రస్తుతం కిలో రూ.1,31,600 ఉంది.

బంగారంలా!

వేడుకల్లో వధూవరుల అలంకారంలో కాకి బంగారాన్ని ప్రత్యామ్నాయంగా వాడుతున్నారు. అంటే నాణ్యత తక్కువ కలిగిన లేదా బంగారం మాదిరిగా కనబడే లోహాలతో ఆభరణాలు ఉంటున్నాయి. వేడుకలకు వచ్చే మహిళలు ఎక్కువ శాతం రోల్డు గోల్డు, వన్ గ్రామ్ గోల్డు ఆభరణాలు ధరిస్తున్నారు.చెవిదిద్దుల నుంచీ వడ్డాణం వరకూ రోల్డు గోల్డు నగలు అందుబాటులో ఉండడంతో వాటినే ఎక్కువ శాతం వినియోగిస్తున్నారు.

అప్రమత్తంగా లేకుంటే పశు మరణాలు

- పాల ఉత్పత్తి తగ్గే ప్రమాదం
- టీకాల ద్వారా ముందస్తు నివారణ సాధ్యం
- రేపటి నుంచి గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం

(ఆంధ్రజ్యోతి-పిఠాపురం/గొల్లప్రోలు)

ఒక్క టీకాతో వ్యాధిని నివారించవచ్చు. నిర్లక్ష్యం చేస్తే పశువుల్లో పాల ఉత్పత్తి తగ్గడంతో పాటు ప్రాణాలకు ముప్పు పొంచి ఉంది. పశువుల సామర్థ్యాన్ని దెబ్బతీసే ఈ వ్యాధి నివారణకు ప్రభుత్వమే టీకాలు ఉచితంగా సరఫరా చేయడంతో పాటు నెలరోజులపాటు గ్రామాలు, పట్టణాల్లో ఉచితంగా వేయించే కార్యక్రమాన్ని చేపట్టింది. రైతులు అందరు తమ పశువులకు ఉచితంగా టీకాలు వేయించుకోవాలని విస్తృత ప్రచారం సాగిస్తున్నారు. పశువుల్లో వచ్చే ప్రమాదకరమైన వ్యాధుల్లో గాలికుంటు (ఫుట్ అండ్ మౌత్ డిసీజ్) వ్యాధి ఒకటి. చీలు గిట్టలు ఉండే జంతువుల్లో సంబవించే తీవ్రమైన వైరల్ అంటువ్యాధి ఇది. ఈ వ్యాధి వస్తే పాల ఉత్పత్తి, పనిచేసే సామర్థ్యం తగ్గిపోవడంతో తీవ్రమైతే పశువులు చనిపోయే ప్రమాదముంది. ఈ వ్యాధిని నిరోధించే కార్యక్రమాల్లో భాగంగా జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం ద్వారా ఏటా రాష్ట్రప్రభుత్వం గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం చేపడుతోంది. టీకాలు వేయించడం ద్వారా వ్యాధిని నివారించే అవకాశం ఉంది. జిల్లాలో టీకాలను ఈనెల 15 నుంచి అక్టోబరు 15 వరకూ నిర్వహించనున్నారు.

లక్షణాలు ఇవి..

గాలికుంటు వ్యాధి సోకిన పశువులు తీవ్రమైన జ్వరంతో బాధపడతాయి. నీరసం అధికంగా ఉండటం, నోటి నుంచి తీగల వలే చొంగ లేదా నీరు కారడం, నోటి దగ్గర, కాలిగిట్టల మధ్య పుండ్లు పడటం, పాల దిగుబడి తగ్గడం, చూడి పశువులు ఈసుకుపోవడం, చిన్నపాటి ఎండకు రొప్పడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ లక్షణాలు ప్రాథమిక దశలోనే రైతులు గుర్తించాలి. పాల ఉత్పత్తి తగ్గిపోతుంది. పనిచేసే సామర్థ్యం తగ్గిపోయి పశువులు నీరసపడతాయి. దీనివల్ల రైతులకు ఆర్థికంగా నష్టం వాటిల్లుతుంది.



పశువుల్లో గాలికుంటు వ్యాధి లక్షణాలు ఇలా..

నివారణా చర్యలు...

అనారోగ్యంగా ఉన్న పశువుల దగ్గరకు కొత్త పశువులు రాకుండా చూసుకోవాలి. పశువులు ఉంచే పాకలు, షెడ్లు, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే పశువైద్యుడిని సంప్రదించి పశువులకు చికిత్స అందించాలి. ఇక వ్యాధి నిరోధక టీకాల వల్ల పలు ప్రయోజనాలు ఉన్నాయి. జంతువుల్లో రోగ నిరోధక శక్తిని పెంచే గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను తప్పనిసరిగా వేయించాలి. తద్వారా పశువుల్లో వ్యాధి రాకుండా నిరోధించే అవకాశం ఉంది. దూడలకు మొదటి టీకాను నాలుగు నెలల వయస్సులో వేయించి అక్కడ నుంచి ప్రతి ఆరునెలలకు ఒకసారి వాక్సినేషన్ వేయించాలి.

టీకాలు ఉచితం..

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను ప్రభుత్వమే ఉచితంగా అందిస్తోందని గొల్లప్రోలు ఏరియా ప్రభుత్వ పశువైద్యశాల సహాయ సంచాలకుడు ముమ్మిడి శ్రీనివాసరావు చెప్పారు. సోమవారం నుంచే టీకాలు వేస్తారని తెలియజేశారు.

'ధన'దినాభివృద్ధితో..

- దూకుడు పెంచిన రిజిస్ట్రేషన్ శాఖ
- ఈ ఏడాది రెవెన్యూ మెరుగుదల
- ఐదు నెలల లక్ష్యం రూ.230.65 కోట్లు
- రూ.198.37 కోట్ల ఆదాయం రాక
- 86 శాతం మేర లక్ష్యానికి చేరువ
- 38,984 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ పూర్తి
- ప్రభుత్వ నూతన సంస్కరణలతోనే ఇలా..



కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖలో కూటమి సర్కారు తీసుకువచ్చిన సంస్కరణలతో ఆ శాఖకు ఆదాయం సమకూరుతోంది. అలాగే కక్షిదారులకు సమయం ఆదా అవుతోంది. జిల్లాలోని ఒక జిల్లా రిజిస్ట్రార్, తొమ్మిది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్థిరాస్తి దస్తావేజుల రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వానికి ఆదాయం పెరుగుదలలో పురోగతి కనిపిస్తోంది.

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

గతేడాది అనుకున్న ఆదాయపు లక్ష్యాన్ని చేరుకోలేని జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ ఈ ఏడాది మాత్రం దూసుకుపోతోంది. నిర్ణయించిన లక్ష్యానికి ఆరు నెలల కాలంలోనే చేరువవుతోంది. జిల్లాలో కాకినాడ, కాకినాడ రూరల్ సర్పవరం, పెద్దాపురం, సామర్లకోట, పిఠాపురం, తుని, తాళ్లరేవు, ప్రత్తిపాడు, జగ్గంపేటలలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. గత ఏడాది 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు రూ.615.39 కోట్లు లక్ష్యం కాగా, రూ.386.54 కోట్ల లక్ష్యానికి మాత్రమే చేరుకున్నారు. అంటే 62.81 శాతం మాత్రమే టార్గెట్ పూర్తి చేశారు. ఈ ఏడాది ఏప్రిల్ 2025 నుంచి 2026 మార్చి వరకు మొత్తం లక్ష్యం రూ.555.79 కోట్లు లక్ష్యంగా ప్రభుత్వం నిర్ణయించింది. గడిచిన ఐదు నెలలు (ఏప్రిల్-ఆగస్టు) రూ.230.65 కోట్ల లక్ష్యం కాగా రూ.198.37 కోట్లు వసూలైంది. దీంతో 86 శాతం మేర లక్ష్యానికి చేరువయ్యారు. ఇప్పటివరకు జిల్లాలో 38,984 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ పూర్తయ్యాయి.

ఆదాయం మెరుగుదలకు కారణాలెన్నో..

ఈ ఏడాది ఆదాయ లక్ష్యం చేరువకావడానికి అనేక కారణాలున్నాయి. ముఖ్యంగా కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన అనేక సంస్కరణలు రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం మెరుగుదలకు తోడ్పడ్డాయి. నూతనంగా వచ్చిన స్లాట్ బుకింగ్ విధానం కక్షిదారులకు నిరీక్షించే బాధ లేకుండా చేసింది. గతంలో ఈ విధానం లేక కక్షిదారులు కార్యాలయాల వద్ద పడిగాపులు పడేవారు. ఉదయం నుంచీ అక్కడే ఉండాల్సి వచ్చింది. అయితే ప్రస్తుతం ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకోవడం.. అక్కడ ఇచ్చిన తేదీ, సమయానికి వెళ్లి.. రిజిస్ట్రేషన్ తతంగాన్ని నిర్ణీత సమయంలోనే పూర్తి చేసుకోవడం అంతా వేగంగా జరిగిపోతున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ప్రభుత్వం ఈ విధానాన్ని తీసుకొచ్చింది. అలాగే రిజిస్ట్రేషన్ పూర్తయిన వెంటనే మధ్యవర్తుల ప్రమేయం లేకుండా అసలైన (ఒరిజినల్) దస్తావేజులు కొనుగోలుదారు వాట్సాప్‌కు వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. ఆగస్టు ఒకటో తేదీ నుంచి ఆస్తుల రిజిస్ట్రేషన్‌తోపాటు ఆటో మ్యూటేషన్ విధానాన్ని అమలుచేస్తున్నారు. గతంలో నగరాల్లో ఏదైనా ఆస్తిని కొనుగోలు చేస్తే.. ఆ దస్తావేజులు తీసుకుని మున్సిపాలిటీల్లో ఆ ఆస్తులకు సంబంధించిన యజమాని పేర్లు మార్పు చేయించుకోవలసి వచ్చేది. నేడు అది లేదు. నేరుగా ఆస్తులు రిజిస్ట్రేషన్ పూర్తయ్యే సమయంలోనే ఆటోమ్యూటేషన్ చేసేస్తున్నారు. దీంతో పూర్తి యాజమాన్య హక్కు పొందే అవకాశం ఏర్పడుతుంది. అలాగే గడిచిన ఆరు మాసాల్లో భూములు, ఇళ్ల రిజిస్ట్రేషన్లు బాగా పెరిగినట్టుగా సబ్ రిజిస్ట్రార్లు చెబుతున్నారు.

17 నుంచి 'స్వస్థనారి - శక్తివంతమైన కుటుంబం అభియాన్' : డీఎంహెచ్‌వో

జీజీహెచ్(కాకినాడ) సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారత కోసం, ఆరోగ్య సహిత స్త్రీశక్తిని పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో 'స్వస్థనారి- శక్తివంతమైన కుటుంబం అభియాన్' కార్యక్రమాన్ని ఈనెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు జిల్లావ్యాప్తంగా నిర్వహించడం జరుగుతుందని డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ అన్నారు. కార్యక్రమంలో భాగంగా జిల్లావ్యాప్తంగా మొత్తం 491 ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు జిల్లా ఆసుపత్రి, సీహెచ్‌సీలు, పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో ఏర్పాటుచేస్తామని ఒక ప్రకటనలో డీఎంహెచ్‌వో తెలిపారు. శిబిరాల్లో మహిళలు, పిల్లలకు విస్తృత వైద్య సేవలు అందిస్తామన్నారు. ముఖ్యంగా మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్లు (రొమ్ము, గర్భాశయ, నోరు), క్షయ, అనీమియా, సికిల్‌సెల్ వ్యాధి స్క్రీనింగ్, గర్భిణీలకు ఆరోగ్య పరీక్షలు, పోషణ సలహాలు, టీకాలు, రక్తదానం, పోషకాహార అవగాహన, పీఎం-జే అండ్ ఆభాకార్డ్ నమోదు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ ఎంపానెల్డ్ ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ), (ఫాగ్‌సి) వైద్యులు సైతం భాగస్వామ్యులు అవుతారన్నారు. ఈ అభియాన్‌కు ఎన్‌సీడీ-ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ వి.అరుణను నోడల్ ఆఫీసర్‌గా నియమించినట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ నాయక్ వెల్లడించారు. ప్రతి ఒక్కరు తప్పనిసరిగా తమ ఆధార్ కార్డు తీసుకుని సమీప ఆరోగ్య శిబిరాలకు హాజరై ఉచిత ఆరోగ్య పరీక్షలు చేయించుకుని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పిఠాపురంలో పిచ్చికుక్క స్వైరవిహారం
పది మందికి తీవ్రగాయాలు
భయాందోళనకు గురైన ప్రజలు 7

సెల్‌ఫోన్లకు బందీలయ్యారా..!



● శారీరక, మానసిక సమస్యలు తప్పవు ● మానవ సంబంధాలపై సెల్‌ఫోన్ ప్రభావం..

బూచాడమ్మా బూచాడు బుల్లి పెట్టెలో ఉన్నాడు.. కళ్లకెప్పుడు కనబడడు కబురులెన్నో చెబుతాడు అంటూ మనసు కవి ఆచార్య ఆత్రేయ 55 ఏళ్ల క్రితమే ఫోన్ గురించి మహా గొప్పగా వివరించారు. ఆ ఫోన్లు రూపాంతరం చెందాయి. సెల్‌ఫోన్‌తోనే మనిషి మనుగడ ముడిపడి పోయింది. సెల్‌ఫోన్ లేని జీవితాన్ని ఏ మనిషి ఊహించుకోలేని పరిస్థితి. కులమతాలకు అతీతంగా, ధనిక పేద తారతమ్యం లేకుండా అందరినీ అరచేతిలో బంధించేసింది. సెల్‌ఫోన్‌ను ఎంతవరకు ఎప్పుడు ఎలా ఉపయోగించుకోవాలో అలా ఉపయోగించుకునే వారిని వేళ్ల మీద లెక్కించవచ్చు. కానీ 80 శాతం మంది సెల్‌ఫోన్ బంధిఖానాలో చిక్కుకున్నవారే. చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు సెల్‌కు బంధీలే. అటువంటి సెల్‌ఫోన్‌తోనే గంటల తరబడి గడుపుతున్నారా. మరి సెల్‌ఫోన్ స్ర్కీన్‌టైమ్ పెరిగితే అనర్థమే అన్న విషయాన్ని మరిచిపోతున్నారు.

శారీరక మానసిక సమస్యలు తప్పవు..

అమలాపురంరూరల్, సెప్టెంబరు13 (ఆంధ్రజ్యోతి):విద్యార్థులు క్రీడల పట్ల కంటే సెల్‌ఫోన్ వినియోగంతోనే కాలం గడిపేస్తున్నారు. ప్రతీ ఇంట్లో ఒక్కొక్కరికి ఒక్కో ఫోన్ విధానంతో కుటుంబ సంబంధాలు దెబ్బతినడంతోపాటు శారీరక మానసిక సమస్యల బారిన పడుతున్నవారు ఎందరో ఉన్నారని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఇక అదే ఫోన్‌తో రీల్స్ చేసి డబ్బులు సంపాదించేవారు ఉన్నారు. సర్వం సెల్‌ఫోన్ మయంగా మారిపోవడంతో భవిష్యత్ పరిణామాలు ఏ విధంగా ఉంటాయో అన్న ఆందోళన కూడా ఉంది.

సెల్‌ఫోన్‌తో అనారోగ్య సమస్యలు..

రోజులో ఎక్కువ గంటలు ఫోన్ చూసినా లేక ఫోన్‌లో ఎక్కువగా మాట్లాడే వారిపై రేడియేషన్ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. అది మెదడుపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది.



దీనివల్ల కొందరికి బ్రెయిన్ ట్యూమర్లు వచ్చే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. సెల్‌ఫోన్ ఎక్కువగా వినియోగించే వారిలో సంతాన సాఫల్య సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. కొందరిలో వీర్య కణాల ఉత్పత్తి తగ్గడం, లైంగిక సమస్యలు తలెత్తే అవకాశాలు ఉన్నాయంటున్నారు.

మానసిక సమస్యలు ఇలా..

సెల్‌ఫోన్ ఎక్కువగా చూసే వారిలో బ్లూ లైట్ కంటి మీద పడి బ్రెయిన్‌లోని మెలటోనిన్ దెబ్బ తింటుంది. దీంతో స్లీప్ సైకిల్ అన్‌బ్యాలెన్స్ అవ్వడంతో నిద్ర పట్టకపోవడం, మధ్య రాత్రిలో మెలుకువ వచ్చేస్తోంది. ఇలాంటి వారిలో కోపం, చిరాకు, అసహనం పెరుగుతోంది. విద్యార్థులు చదువుపై ఏకాగ్రత కోల్పోవడం, చదివింది గుర్తుకు రాకపోవడం జరుగుతోంది. దానివల్ల చదువు దెబ్బతింటుంది. ఇక ఉద్యోగులైతే పనిపై దృష్టి పెట్టలేకపోవడం, కింది స్థాయి సిబ్బందితో అనవసర వాదులాటలకు దిగడం, ప్రవర్తనలో మార్పుతో పాటు కోపం విపరీతంగా పెరిగిపోతుంది. మానసిక సమస్యల్లో భాగంగా కొందరిలో ఆకలి దెబ్బతింటుంది. ఏమీ తినకపోవడంతో పోషకాహారం లోపించి మనిషి ఎదుగుదలపై ప్రభావం చూపిస్తోంది.

సెల్‌తో మానసిక ఒత్తిళ్లు

-డాక్టర్ పి.సౌమ్య, మానిసిక వైద్య నిపుణురాలు, అమలాపురం



సెల్‌ఫోన్ ఎక్కువగా చూసేవారు, మాట్లాడేవారిలో మానసిక ఒత్తిళ్లు పెరుగుతాయి. స్ర్టెస్, యాంగ్జయిటీ కారణంగా నిద్రలేమి సమస్యలు తలెత్తుతాయి. రేడియేషన్ ప్రభావంతో నరాల సమతుల్యత దెబ్బతింటుంది. ఏకగ్రత తగ్గి, జ్ఞాపకశక్తి అంతకంతకు నశిస్తోం ది. రేడియేషన్ ప్రభావంతో ఇతర అనారోగ్య సమస్యలు కూడా ఉత్పన్నం అవుతాయి.

కమ్ముకున్న మబ్బులు



తూర్పు కనుమల్లో కనువిందుచేస్తున్న మబ్బులు

కాకినాడ జిల్లా తునిలో శనివారం వేకువ జాము నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో జన జీవనం స్తంభించింది. మెట్టలో కురిసిన జోరువానకు తుని తూర్పు కనుమల్లో జాతీయ రహదారిపై కమ్ముకున్న మబ్బులు చూపరులను కనువిందు చేశాయి.

-తుని రూరల్(ఆంధ్రజ్యోతి)

ఊటీని తలపించేలా..



దేవీపట్నం మండలం నేలకోట గ్రామ సమీపంలో కొండలపై మంచుతెరల్లా మేఘాలు

శనివారం ఉదయం అల్లూరి జిల్లా దేవీపట్నం మండలంలో నేలకోట గ్రామ సమీపంలో వర్షం కురిసిన అనంతరం ఊటీని తలపించేలా కొండలపై మేఘాలు తెల్లని మంచుతెరల్లా కమ్మాయి. దీంతో పర్యాటకులను ఆకట్టుకున్నాయి.

-దేవీపట్నం(ఆంధ్రజ్యోతి

రేపు వికాస జాబ్ మేళా

కాకినాడసిటీ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వికాస ఆధ్వర్యంలో ఈనెల 15న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. ఈ జాబ్ మేళాలో వివిధ కంపెనీలలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఈ ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో, బీటెక్ ఉత్తీర్ణులైన 35సంవత్సరాల్లోపు అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.12వేల నుంచి రూ.30వేల వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలకు బట్టి ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు సోమవారం ఉదయం 9 గంటలకు కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయం వద్దకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 77993 76222లో సంప్రదించాలన్నారు.

చర్లపల్లి-అనకాపల్లి మధ్య 8 ప్రత్యేక రైళ్లు



సామర్లకోట, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): పండుగ సీజన్‌లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని చర్లపల్లి-అనకాపల్లి మధ్య సామర్లకోట మీదుగా ప్రత్యేక రైళ్లను శనివారం నుంచి నడుపుతున్నట్లు రైల్వే సీపీఆర్వో ఏ.శ్రీధర్ తెలిపారు. 07035 నంబరుగల చర్లపల్లి-అనకాపల్లి ప్రత్యేక రైలు సెప్టెంబరు 13, 20, 27 అక్టోబరు 4వరకూ ప్రతీ శని వారం చొప్పున నాలుగు ట్రిప్‌లుగా నడుస్తోం ది. 07036 నంబరుగల అనకాపల్లి-చర్లపల్లి మధ్య ప్రత్యేక రైలు సెప్టెంబరు 14, 21, 28 అక్టోబరు 5 వరకూ ప్రతీ ఆదివారం చొప్పున నాలుగు ట్రిప్‌లు నడుస్తోంది. ఈ ప్రత్యేక రైళ్లు జనగాం, ఖాజీపేట, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, మధిర, రాయనపాడు, ఏలూరు, తాడేపల్లిగూడెం. నిడదవోలు, రాజమహేంద్రవరం, సామర్లకోట, అన్నవరం, యలమంచిలి స్టేషన్లలో హాల్ట్ ఉన్నట్లు తెలిపారు. ఫస్ట్ ఏసీ, సెకండ్ ఏసీ, థర్డ్ ఏసీ, స్లీపర్‌క్లాస్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటుచేసినట్లు సీపీఆర్వో శ్రీధర్ ఆ ప్రకటనలో తెలిపారు. ఈ ప్రత్యేక రైళ్లల్లో ప్రయాణించేవారు రిజర్వేషన్ టిక్కెట్ల కోసం ఆయా సమీప రైల్వే బుకింగ్ కార్యాలయాలలో సంప్రదించాలని రైల్వే సీపీఆర్వో తెలిపారు.

ఆల్‌టైం రికార్డు

వర్జీనియా పొగాకు @430

● ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు



జంగారెడ్డిగూడెం కేంద్రం-32లో వేలం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): వర్జీనియా పొగాకు ధరలకు రెక్కలొచ్చాయి. మునుపెన్నడూ లేనివిధంగా కొయ్యలగూడెం వేలం కేంద్రంలో శనివారం కిలో క్వాలిటీ వర్జీనియా పొగాకు ధర రూ.430 పలికింది. ఇది ఎన్ఎల్ఎస్ చరిత్రలోనే రికార్డు ధర. గత ఏడాది కిలోపొగాకుకు అధిక ధర రూ.411 పలకగా ఈ ఏడాది రూ.19అదనంగా పెరిగి రికార్డు సృష్టించింది. శుక్రవారం జంగారెడ్డిగూడెం వేలం కేంద్రం-32లో కిలో పొగాకు ధర రూ.418 చేరింది. ప్రస్తుతం కిలో ధర 430కు చేరడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తాము పడిన శ్రమకు చివరిలోనైనా ఊరట లభించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఐదు వేలం కేంద్రాల్లో ధరలు ఇలా..

కొయ్యలగూడెం వేలం కేంద్రం- క్వాలిటీ పొగాకు కిలో ధర రూ.430, జంగారెడ్డిగూడెం వేలం కేంద్రం-32లో ధర రూ.429, గోపాలపురం వేలం కేంద్రంలో రూ.429, జంగారెడ్డిగూడెం వేలం కేంద్రం-18లో రూ.428, దేవరపల్లి వేలం కేంద్రంలో రూ.428,లో-గ్రేడు పొగాకు దేవరపల్లిలో కిలో రూ.130 ఉండగా మిగతా నాలుగు వేలం కేంద్రాల్లో రూ.200గా ఉంది. లో-గ్రేడు పొగాకు ధరలు పెరిగితే రైతులకు లబ్ధి చేకూరినట్లు అవుతుంది.



పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంలో నిర్వహించిన దత్తహోమంలో పాల్గొన్న భక్తులు

మహాసంస్థానానికి పోటెత్తిన భక్తులు

పిఠాపురం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానానికి శనివారం భక్తులు పోటెత్తారు. శని, ఆదివారాలు వరుస సెలవులు రావడంతో మహారాష్ట్ర, ఒరిస్సాలతో పాటు ఉభయ తెలుగురాష్ట్రాలు నుంచి భక్తులు అధికంగా తరలివచ్చారు. దర్శనానికి భక్తులు బారులు తీరారు. శ్రీపాదశ్రీవల్లభులకు అభిషేకాలు, దత్తహోమం, గోపూజ నిర్వహించారు. శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహ సరస్వతులకు ప్రత్యేక అలంకారం చేశారు. భక్తులకు అన్నప్రసాదాలు అందజేశారు. ఆలయ ఈవో సౌజన్య ఆధ్వర్యంలో ఏర్పాట్లు పర్యవేక్షించారు.

విశ్వబ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా సాయి



తాళాబత్తుల సాయి

పెద్దాపురం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): విశ్వబ్రాహ్మణ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా పెద్దాపురం పట్టణానికి చెందిన ప్రముఖ సూక్ష్మ కళాకారుడు, గిన్నీస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు విజేత డాక్టర్ తాళాబత్తుల సాయిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ సందర్భంగా సాయి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విశ్వబ్రాహ్మణుల సంక్షేమం, అభివృద్ధి కోసం కృషిచేస్తానని విశ్వబ్రాహ్మణులు, చేతివృత్తుల మీద ఆధారపడి జీవనం సాగిస్తున్నారని వారికి ప్రభుత్వం ద్వారా వచ్చేటువంటి సంక్షేమ పథకాలను అందించేందుకు కృషిచేస్తానన్నారు. డైరెక్టర్‌గా నియమితులైన సాయి ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి(బాబు)కు కృతజ్ఞతలు తెలిపారు. పలువురు ప్రముఖులు, కూటమి నేత లు సాయిని అభినందించారు.

లోక్ అదాలత్‌లో 4733 కేసుల పరిష్కారం

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి(ఇన్చార్జి) మాధురి



బ్యాంకు చెక్కు నమూనాను అందజేస్తున్న జడ్జి మాధురి

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరిలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 4733 కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించడం జరిగిందని, దీంతో రాష్ట్రంలో జిల్లా మెరుగైన స్థానంలో ఉందని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి (ఇన్చార్జి) ఎం.మాధురి తెలిపారు. రాజమహేంద్రవరం జిల్లా కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రమాదాల్లో మృతి చెందిన కేసుల్లో లోక్ అదాలత్‌లలో రాజీ చేసుకుంటే పరిహారం కోసం ఎక్కువ రోజులు వేచి చూడాల్సిన అవసరం లేదని, బాధితులు తన బ్యాంకు ఖాతాను ఇన్స్యూరెన్స్ కంపెనీకి తెలియజేసిన నెల రోజుల్లో పరిహారం సొమ్ము ఖాతాలో జమ అవుతుందన్నారు. రాజీ ద్వారా ఇరువర్గాలకూ మేలు జరుగుతుందన్నారు. ఉమ్మడి జిల్లాలో 42 ప్రత్యేక న్యాయపీఠాల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించగా వివిధ కేసుల్లో రూ.16.36 కోట్ల పరిహారం అందజేసినట్టు మాధురి పేర్కొన్నారు.కార్యక్రమంలో పదో అదనపు జిల్లా జడ్జి ఉమాసునంద, ఏసీబీ కోర్టు జడ్జి వెంకటేశ్వరరావు,ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జానీబాషా తదితర న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

భక్తులతో పోటెత్తిన వాడపల్లి క్షేత్రం



స్వామి దర్శనానికి లైన్లలో వేచి ఉన్న భక్తులు

» వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు
» స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.81.54 లక్షలు

ఆత్రేయపురం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వా మి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. రెండో శనివారం సెలవు దినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తజనం చిరుజల్లులలోను తిరువీధుల్లో ఏడు ప్రదక్షిణలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. వేకుమజామునే స్వామి వారి కి సుప్రభాతసేవ, ఐశ్వర్యలక్ష్మిహో మం, బాలభోగం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పలపు ష్పాలతో అలకరించారు. భారీ లైన్ల స్వామివారిని దర్శించుకున్న భక్తులు తులభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి రాజమహేంద్రవరానికి చెందిన సుంకవల్లి వినిత్ కుటుంబ సభ్యులు రూ.50 వేలు విరాళం అందించారు. దాతకు స్వామివారి చిత్రపటం అందజేశారు. స్వామివారి సన్నిధిలో భక్తుల కోసం మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఆలయ ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.



వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి

వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్క రోజు ఆదాయం రూ.81.54 లక్షలు లభించినట్టు ఉపకమిషనరు తెలిపారు.

బస్సుల కోసం మహిళా భక్తులు ఎదురుచూపులు

వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా వచ్చిన మహిళా భక్తులు తిరుగు ప్రయాణంలో ఆర్టీసీ బస్సుల కోసం ఎదురు చూపులు చూశారు.రెండో శనివారం పాఠశాలలకు సెలవు దినం కావడంతో అధిక సంఖ్యలో భక్తజనం ఆలయానికి రావడంతో ఉచిత దర్శనం, రూ.50 దర్శనానికి గంటలు తరబడి లైన్‌లో అవస్థలు పడ్డారు. మహిళలకు ఆర్టీసీ ద్వారా ఉచిత ప్రయాణ పథకం ఉండటంతో బస్సుల్లో వివిధ ప్రాంతాలు నుంచి వాడపల్లి సన్నిధికి చేరుకున్నారు. మహిళా భక్తుల రద్దీకి అనుగుణంగా బస్సులు లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. శనివారం రాత్రి స్వామి దర్శనం ముగించుకుని తమ ఇళ్లకు చేరుకునేందుకు ఆర్టీసీ బస్సులు కోసం గంటల తరబడి నిరీక్షించారు. రావులపాలెం నుంచి ఒక బస్సు వస్తే అందులో సుమారు ఎనభై మంది ఎక్కారు. వాడపల్లి నుంచి కొత్త వంతెన వరకు కిలోమీటర్ల మేర ఆర్ అండ్‌బీ రోడ్డు వైపు నడుచుకుంటు ముందుకు సాగారు. మరికొంతమంది రోడ్డు పక్కనే బస్సుల కోసం ఎదురు చూశారు. బస్సు ఆగిన వెంటనే గుంపులు గుంపులుగా బస్సు ఎక్కారు.





వాడపల్లిలో బస్సుల కోసం ఎదురు చూస్తున్న మహిళలు

బాలబాలాజీ ఆలయం భక్తులతో కిటకిట



అప్పనపల్లి బాలబాలాజీస్వామి

స్వామివారికి ప్రత్యేక పూజలు

మామిడికుదురు, సెప్టెంబరు 13ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానం శనివారం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. వేకువజామునే వేద మంత్రోచ్చారణలతో సుప్రభాత సేవ నిర్వహించి తొలి హారతి ఇచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కొత్త, పాత ఆలయాలు భక్తుల కోలాహలంతో కళకళ్లాడాయి. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ఈవో సత్యనారాయణరాజు, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

నిత్యాన్నదానానికి రూ.10,116

బాలబాలాజీ స్వామి నిత్యాన్నదాన పథకానికి ఏలూరుకు చెందిన అక్కినేని బాలకృష్ణ-షాజని దంపతులు రూ.10,116 విరాళంగా అందించారు. వారికి ఆలయ అర్చకుడు ఆశీర్వచనం అందించారు. సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించి అభినందించారు.

స్వామి వివేకానంద యువతకు ఆదర్శం



ప్రసంగిస్తున్న స్వామి లోకమయానందజీ, పాల్గొన్న పలు కళాశాలల విద్యార్థులు

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద యువతకు ఆదర్శమని స్వామి లోకమయానందజీ మహరాజ్ అన్నారు. స్థానిక రామకృష్ణ మిషన్‌లో శనివారం స్వామి వివేకానంద చికాగో నగర ప్రసంగాల ప్రాముఖ్యత అనే అంశంపై విద్యార్థు లకు నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానంద శీల సంపద,తీక్షణమైన బుద్ధి, అపర మేధాశక్తి కలవారని, నేటి యువత ఆయనను ఆదర్శంగా తీ సుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి జీవితంలో ఒక లక్ష్యం వైపు దృష్టి పె ట్టాలని లక్ష్యసాధన కోసం రాత్రింబవళ్లు, కష్టించి, పట్టుదలతో కృషి చేయాలని విద్యార్థులకు హితవు పలికారు. కార్యక్రమంలో స్వామి సేవ్యానందజీ మహరాజ్, స్వామి శశికాంతానందజీ మహరాజ్, స్వామి పరిజ్ఞేయానందజీ మహరాజ్ ప్రసంగించారు.

కన్నుల పండువగా శాంతి కల్యాణం

శాస్త్రోక్తంగా పూర్ణాహుతి.. ముగిసిన కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి పవిత్రోత్సవాలు



పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

కోరుకొండ, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం లో నాలుగు రోజులుగా జరుగుతున్న పవిత్రోత్సవాలు శనివారం వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, పవిత్ర విసర్జన, పూర్ణాహుతి, సప్తదశ కలశ ప్రోక్షణ, శాంతి కల్యాణం, శాస్త్రోక్తంగా నిర్వహించారు. అంతకు ముందు ఆలయ అను వంశక ధర్మకర్త పరాసర రంగరాజ భట్టర్, అన్నవరం దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు ఆధ్వర్యంలో పండితులు పాణింగపల్లి సత్య పవన్‌కుమార్ ఆచార్యులు బ్రహ్మత్వంలో చక్రవర్తుల సతీష్‌కుమార్ ఆచార్యులు, వాసాని మణికంఠాచార్యులు పూజా దికాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక హోమాలు, యజ్ఞలు, అర్చనలు, అభిషేకాలు జరిగాయి. కార్యక్రమంలో ఆల య అనువంశిక అర్చక స్వాములు, జనసేన నాయకురాలు బత్తుల వెంకటలక్ష్మి, బీజేపీ ఇన్‌చార్జి నీరుకొండ వీరన్నచౌదరి,సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ, కర్రి వీరగణేష్, కటకం చలం, తెలగంశెట్టి శ్రీను, గరగ శ్రీధర్‌బాబు, బదిరెడ్డి దొరతోపాటు కోరుకొండ పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



శాంతి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

మండపేటలో రాష్ట్ర టెన్నీకాయిట్ పోటీలు



టెన్నీకాయిట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు చెప్పారు. మండపేటలో రెండురోజులపాటు జరిగే 49వ రాష్ట్రస్థాయి టెన్నీకాయిట్ పోటీలను శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆయన ప్రారంభించారు.తొలుత జాతీయ పతాకం ఎగురవేసి క్రీడా జ్యోతిని వెలిగించి ఆటలను ప్రారంభించారు. క్రీడల్లో యువత రాణించి దేశానికి పేరు తీసుకురావాలని వేగుళ్ల పిలుపునిచ్చారు. క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. తొలిరోజు పోటీల్లో 15 జిల్లాలకు చెందిన 15 జట్ల నుంచి 120 మంది క్రీడాకారులు బాలురు, బాలికల విభాగాల్లో తలపడ్డారు. హోరాహోరీగా జరిగిన పోటీల్లో క్రీడాభిమానులకు ఉత్కంఠను రేకెత్తించాయి. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాణి, శాప్ డైరెక్టర్ పి.రవీంద్రనాథ్, ఏపీ టెన్నికాయిట్ అసోసియేషన్ కార్యనిర్వాహక అధ్యక్షురాలు అప్పసాని కృష్ణకుమారి, కోశాధికారి కుంచే రమేష్, ముంగర వెంకట్రాజు, గెడా శ్రీనివాస్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కేటీటీవీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కేశవస్వామి సేవలో డీఎస్పీ

ఆత్రేయపురం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పురాణ ప్రసిద్ధిగాంచిన ర్యాలీ జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో శనివారం రాత్రి డీఎస్పీ ఎం.అంబికాప్రసాద్ దంపతులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించుకున్నారు. వేదపండితుల ఆశీర్వచనం అందుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈవో బిహెచ్‌వి రమణమూర్తి స్వామి వారి



చిత్రపటం, శేషవస్త్రం సమర్పించారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

పిల్లలు సరిగ్గా చూడట్లేదని గోదావరిలోకి దూకిన వృద్ధుడు

కాపాడిన పోలీసులు

ఆలమూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పిల్లలు సరిగ్గా చూడట్లేదనే మనస్తాపంతో గోదావరిలోకి దూకేశాడు ఓ వృద్ధుడు.. పోలీసులు రక్షించి ఆసుపత్రికి తరలించారు. ఈ వివరాలను ఆలమూరు ఎస్‌ఐ జి.నరేష్ తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం లొల్ల గ్రామానికి చెందిన కుంపట్ల సత్యనారాయణ (65) శనివారం ఆలమూరు మండలం జొన్నాడ గౌతమి బ్రిడ్జి నుంచి గోదావరిలోకి దూకి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించగా రాజమహేంద్రవరం నుంచి అమలాపురం వెళ్తున్న 2023 బ్యాచ్ డీఎస్పీ పి.ప్రదీప్తి గమనించారు. దీంతో స్థానిక ఎస్‌ఐ నరేష్‌కు సమాచారం అందించగా అక్కడికి దగ్గర్లో ఉండడంతో హుటాహుటిన చేరుకున్నారు. బ్రిడ్జిపై నుంచి దూకి రెయిలింగ్‌కి వేలాడుతున్న వృద్ధుడిని కానిస్టేబుల్ పలివెల రాజు, మొబైల్ హోంగార్డు సాయి, జొన్నాడకు చెందిన జక్కల సూరిబాబు, కోమలి దుర్గప్రసాద్ రక్షించారు. ఆలమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.


జొన్నాడ బ్రిడ్జి మీద నుంచి గోదావరిలోకి దూకిన వృద్ధుడిని రక్షించి తీసుకొస్తున్న దృశ్యం

"నేను బాగా బతికాను. నా పిల్లలు సరిగ్గా చూడట్లేదు. అందుకే మనస్తాపంతో చనిపోవాలనుకున్నాను" అని సత్యనారాయణ పేర్కొన్నాడు.

భార్య పట్టించుకోవట్లేదని విద్యుత్ టవర్ ఎక్కిన భర్త

పోలీసులు నచ్చజెప్పడంతో కిందికి వచ్చిన వైనం

టవర్‌కు పవర్ లేకపోవడంతో తప్పిన ప్రమాదం


కిందకు దిగిన సాయిబాబుకు నీరు తాగిస్తున్న ఏఎస్‌ఐ పట్టాభిరామయ్య


విద్యుత్ టవర్‌పై సాయిబాబు

పి.గన్నవరం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో బంధువులు తన భార్యను పుట్టింటికి తీసుకెళ్లడం, ఆమె తనను పట్టించుకోవట్లేదనే కోపంతో భర్త విద్యుత్ టవర్ ఎక్కేశాడు. చివరికి పోలీసులు వచ్చి నచ్చజెప్పడంతో కిందకి దిగి వచ్చాడు. ఈ సంఘటన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం అక్విడెక్టు సమీపంలో జరిగింది. బాధితుడు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.... పి.గన్నవరం మండలం లంకలగన్నవరం శివారు జొన్నల్లంక గ్రామానికి చెందిన పెస్సింగి సాయిబాబు (48) శనివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో తన భార్య తో జరిగిన గొడవల నేప థ్యంలో పి.గన్నవరం అక్విడెక్టు సమీపంలో కొబ్బరి తోటల్లో ఉన్న భారీ విద్యుత్ టవర్ ఎక్కాడు. స్థానికులు విషయాన్ని పోలీసులకు తెలపగా టవర్ వద్దకు చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం టవర్‌పై ఉన్న సాయిబాబుతో ఏఎస్‌ఐ ఎస్.పట్టాభిరామయ్య ఫోన్‌లో మాట్లాడారు. నీ సమస్యను మేం పరిష్కరిస్తాం.. ముందు టవర్ దిగాలని నచ్చచెప్పారు. దీంతో సుమారుగా గంట పాటు టవర్‌పై ఉన్న సాయిబాబు పోలీసులు నచ్చచెప్పడంతో కిందికి దిగి వచ్చాడు. సాయిబాబు టవర్‌దిగిన వెంటనే పోలీసులు తాగునీరందించి స్టేషన్‌కు తరలించారు. ఇదిలా ఉండగా 3 రోజుల క్రితం భార్య, భర్తకు జరిగిన తగాదాల నేపథ్యం లో సాయి బాబును ఆమె పుట్టింటి వారు మంద లించి భార్యను తీసుకెళ్లిపోయారని స్థానికులు చెప్తున్నారు. తనకు న్యాయం జరగడంలేదని సాయిబాబు ఆత్మహత్య చేసుకోవడానికి టవర్ ఎక్కాడని అంటున్నారు. కాగా గోదావరికి ఇరు వైపులా ఉన్న భారీ టవర్లకు పవర్ కట్ చేసి పాత అక్విడెక్టుపై నుంచి కొత్తలైన్‌ను ఏర్పాటు చేశారు. దీంతో టవర్లపై పవర్‌లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు చెప్తున్నారు.

మూడుసార్లు ఆత్మహత్యాయత్నం...

సాయిబాబు మాట్లాడుతూ "నేను డ్రైవర్‌గా పనిచేస్తూ నా భార్య గంగాభవాని, ముగ్గురు ఆడ పిల్లలకు ఏలోటు లేకుండా చూసుకుంటున్నా. అయినప్పటికి నా భార్య పట్టించుకోవడం లేదు. ఎప్పుడు నా తమ్ముడు, నా అమ్మ అంటుంది. ఈ విషయం జీర్ణించుకోలేక ఆత్మహత్యకు చేసుకుం దామనుకున్నాను. ఇప్పటికే మూడు సార్లు ఆత్మహత్యాయత్నం చేశాను. ఒకసారి గ్రామంలోనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పట్టుకున్నాను, ఇదే టవర్ 2సార్లు ఎక్కాను. గతం ఇదే టవర్‌పైకి ఎక్కి సగంలో నుంచి కిందికి పడిపోతే గాయాలు కూడా అయ్యాయి" అని పేర్కొన్నాడు.

మహిళ అనుమానాస్పద మృతి

కేసు నమోదు చేసిన రావులపాలెం పోలీసులు


మహిళ మృతదేహం

రావులపాలెం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మహిళ అనుమానాస్పదంగా మృతిచెందిన సంఘటనపై రావులపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోన సీమ జిల్లా రావులపాలెం మండలం కొమరాజులంక వంతెన సమీపంలో రహదారి చెంతనే ఒక మహిళ అపస్మారక స్థితిలో పడి ఉందంటూ స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. 108 అంబులెన్స్‌లో ఆమెను కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందిన్నట్టు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి వయస్సు సుమారు 25 నుంచి 30 ఏళ్ల ఉండవచ్చని, రహదారి దాటుతుండగా ఏదైనా వాహనం ఢీకొని వెళ్లిపోయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ చంటి తెలిపారు.

అన్నవరం దేవస్థానం శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆత్మహత్యాయత్నం

స్థలం కొనుగోలు విషయంలో అన్యాయం జరిగినట్టు వెల్లడి

అన్నవరం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వరరావు శనివారం రాత్రి గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఒక స్థలం కొనుగోలు విషయంలో తనకు వ్రత పురోహితుడు అన్యాయం చేయడంతో మానసిక క్షోభకు గురై ఈ చర్యకు పాల్పడినట్టు తెలిపారు. సోషల్ మీడియాలో ఈవోకు తనకు విభేదంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు తప్పుడు ప్రచారం జరిగిందని అది వాస్తవం కాదన్నారు.

అర్ధరాత్రి మద్యం దుకాణంలో చోరీ

తునిలో వరుస దొంగతనాలు

తుని రూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తునిలో దొంగలు హల్‌చల్‌తో పట్టణవాసులు బెంబేలెత్తుతున్నారు. ఇటీవల వరుస దొంగతనాలు మరువక ముందే శుక్రవారం అర్ధరాత్రి తరువాత మరో దొంగతనం జరిగింది. పట్టణంలో ఫైర్ ఆఫీస్ పక్కన ఉన్న మద్యం దుకాణంలో దొంగ ప్రవేశించి చోరీ చేస్తున్న దృశ్యాలు సీసీపుటేజ్‌లో రికార్డు అయ్యాయి. అదేరోజు మరికొన్ని దుకాణాల్లో దొంగతనాలు జరిగినట్టు తెలుస్తుంది. వీటిపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేస్తున్నారు.


మద్యం దుకాణంలో సీసీ పుటేజ్ దృశ్యం

21 మందికి రక్త పరీక్షలు.. 19 మందికి చికున్‌గున్యా

● అనారోగ్యంతో లబ్బర్తి, లాగరాయి, కింద్ర ప్రజలు ● సరిగ్గా అందని వైద్యసేవలు


కింద్రలో ప్రజలతో మాట్లాడుతున్న వైద్య బృందం

రాజవొమ్మంగి సెప్టెంబరు 13 (ఆంధ్రజోతి): అల్లూరి జిల్లా రాజవొమ్మంగి మండలంలోని లబ్బర్తి, లాగరాయి, కింద్ర గ్రామాల్లో ప్రజలు అనారోగ్య సమస్యలతో గత 3 నెలలుగా ఇబ్బందులు పడుతున్నారు. ఆ గ్రామాలకు ఇటీవల జిల్లా కలెక్టర్ వచ్చి వెళ్లిన తరువాత రోజే మహిళ అనారోగ్యంతో మృతిచెందడం తెలిసిందే. అయితే అనారోగ్యానికి గల కారణాలు తెలియకపోవడంతో స్టేట్ టీం కింద్రలో ఈనెల 10న వైద్య శిబిరం నిర్వహించి 21మంది నుంచి రక్త నమునాలు సేకరించింది. అయితే వారిలో 19మందికి చికున్‌గున్యా పాజిటివ్ వచ్చినట్టు అధికారులు శుక్రవారం రాత్రి నిర్ధారించారు. అయితే 21 మందికి పరీక్షలు చేస్తే అందులో 19మందికి పాజిటివ్ రావడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. జూన్ నెల నుంచే గ్రామంలో ప్రజలు అనారోగ్యానికి గురైతే అప్పట్లోనే అధికారులు ఆరుగురికి రక్త పరీక్షలు చేసి ఒకరికి చికున్‌గున్యా పాజిటివ్ వచ్చినట్టు తెలిపారు. అయితే అప్పట్నుంచి ఎటువంటి చర్యలు చేపట్టలేదు. కేవలం పీహెచ్‌సీ పరిధిలో సిబ్బందితో మెడికల్ క్యాంప్ పెట్టామంటూ తంతు గడిపారే తప్ప అధిక సంఖ్యలో ప్రజలు అనారోగ్యానికి గురికాకుండా చర్యలు చేపట్టలేదు. గ్రామాల్లో పరిస్థితులపై ఆగస్టు 25న ఎంపీపీ గోము వెంకటలక్ష్మి కలెక్టర్‌కు నివేదించడం వల్ల 29న డీఎంహెచ్‌వో వచ్చి ప్రజలతో మాట్లాడి వెళ్లారు. మళ్లీ సెప్టెంబర్ 8న పత్రికల్లో వార్తలు రావడంతో అధికార యంత్రాంగం కదిలి ప్రస్తుతం డిస్ట్రిక్ టీం, స్టేట్ టీం అంటూ గ్రామల్లో చర్యలు చేపడుతున్నారు. ప్రజలు చనిపోతే తప్ప ప్రభుత్వానికి పట్టదా అంటూ ప్రజాప్రతినిధులు ప్రశ్నించినా, అప్పటికే లాగరాయి గ్రామంలో మహిళ మృతిచెందిన ఘటన జరిగింది.

మేం కారకులం కాదు..

లబ్బర్తి, లాగరాయి, కింద్రలో ప్రజలు అనారోగ్యానికి గురికావడానికి కారకులం మేం అంటే మేం కాదు అంటూ వైద్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది వంతు వేసుకుంటున్నారు. 3 గ్రామాల్లో ముందుగా ఒకరికి అనారోగ్యం వచ్చినప్పటికి మిగిలిన వారికి 3 నెలల వ్యవధిలో వ్యాప్తి చెందిందని, అనారోగ్యానికి గురికాకుండా ప్రజలకు అవగాహన కల్పించడం, మందులు ఇవ్వడంలో వైద్యాధికారులు విఫలమయ్యారంటూ సర్పంచ్‌లు చెప్తున్నారు. అయితే గ్రామాల్లో పారిశుధ్య లోపం కారణంగానే అనారోగ్యమంటూ వైద్యాధికారులు వాదిస్తున్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

● సఖినేటిపల్లి రేవులో అదుపు తప్పిన పంటు ● ఒడ్డుకు చేర్చిన డ్రైవర్

అంతర్వేది, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి-నర్సాపురం రేవులో నిత్యం ప్రయాణికులతో పంటు రాకపోకలు రద్దీగా జరుగుతాయి. అయితే శనివారం అలల ఉధృతి కారణంగా పంటు అదుపు తప్పింది. డ్రైవర్ చాకచక్యంతో పంటును ఒడ్డుకు చేర్చడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. చించినాడ వంతెన మరమ్మతుల నేపథ్యంలో బస్సులకు రాకపోకలు నిలిపి వేయడంతో సఖినేటిపల్లి రేవు మీదుగా నర్సాపురం చేరుకునేందుకు ప్రయాణికులు అధికంగా ఉండడంతో, అలల ఉధృతి కూడా పెరగడంతో పంటు అదుపుతప్పింది. ఎవరికీ ఎటువంటి ఇబ్బంది కలగకుండా పంటు డ్రైవర్ నేర్పుతో పంటును ఒడ్డుకు చేర్చాడు. ఇప్పటికైనా అధికారులు ఓవర్ లోడ్ వేయకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.


సఖినేటిపల్లి రేవులో అలల ఉధృతికి అదుపు తప్పిన పంటు

కరపలో అగ్నిప్రమాదం

రూ.3 లక్షల ఆస్తినష్టం


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కరప, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరపలో శనివారం ఉదయం అగ్నిప్రమాదం జరిగి రూ.3లక్షల ఆస్తి నష్టం సంభవించింది. కరప-పెనుగుదురు ప్రధాన రహదారిలో తిరుమల వైన్స్ షాపును చేర్చి ఆరు గుడిసెల్లో రాయల్ దాబా నిర్వహిస్తున్నారు. శనివారం ఉదయం కిచెన్ షెడ్‌లో అకస్మాత్తుగా మంటలు చెలరేగి క్షణాల్లో చుట్టూ ఉన్న గుడిసెలకు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో మూడు గుడిసెలు అగ్నికి ఆహుతై వాటిట్లని ఫర్నీచర్, ఫ్రిజ్‌లు, కిచెన్ సామాగ్రి కాలి బూడిదయ్యాయి. సమాచారం అందుకున్న జగన్నాయక్‌పూర్ ఫైర్‌స్టేషన్ ఏడీఎఫ్‌వో బి.ఏసుబాబు సిబ్బందితో కలిసి ఘటనా స్థలికి చేరుకున్నారు. రెండు గంటల పాటు సిబ్బంది శ్రమించి ఫైరింజన్‌తో మంటలు ఆర్పడంతో పక్కనే ఉన్న వైన్‌షాపు, మిగిలిన మూడు గుడిసెలకు పెను ప్రమాదం తప్పింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగినట్టుగా కరప పోలీసులు, అగ్నిమాపకదళ సిబ్బంది ప్రాథమికంగా గుర్తించారు.

పిఠాపురంలో పిచ్చికుక్క స్వైర్వవిహారం

పది మందికి తీవ్రగాయాలు

భయాందోళనకు గురైన ప్రజలు



బాధితులకు చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది


పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో కుక్కకాటు బాధితులు

పిఠాపురం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలో శనివారం రాత్రి పిచ్చికుక్క స్వైర్వవిహారం చేసింది. పదిమందికి పైగా గాయాలయ్యాయి. పట్టణంలోని సాలిపేట, తారకరామనగర్ ప్రాంతాల్లో రోడ్డుపై నడిచి వెళ్తున్న, ఇళ్ల వద్ద బయట ఉన్న వారిని విచక్షణారహితంగా కరిచింది. దారిపోడవునా ఎవరిని వదలకుండా దాడి చేయడంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. పది మందికి పైగా తీవ్ర గాయాలు కాగా వారంతా ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమి త్తం వెళ్లారు. కొందరికి లోతుగా గాయాలు కావడంతో వైద్యులు చికిత్స అందించారు. తారకరామనగర్‌కు చెందిన బూరాడ లక్ష్మి, మార్కెట్ వీధికి చెందిన ముత్తుర్తి శివ, సాలిపేటకు చెందిన కాకి కుక్కేటేశ్వరరావు, మేకా వారి వీధికి చెందిన కోట వీర్రాజు, విరవాడ గ్రామానికి చెందిన బొజ్జా వీర వెంకట సత్యనారాయణ, గొల్లప్రోలు పట్టణానికి చెందిన పప్పు వరప్రసాద్ సహా పలువురు గాయాలబారిన పడారు. ఈ ప్రాంతంలో కుక్కల బెడద అధికంగా ఉందని నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.

సత్యదేవుడి సన్నిధిలో ఆదాయపు పన్ను శాఖ డైరెక్టర్ జనరల్ పూజలు


సత్యదేవుడి దర్శనానంతరం ఆదాయపు పన్ను శాఖ డైరెక్టర్ జనరల్

అన్నవరం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధిలో శనివారం ఆదాయపు పన్ను శాఖ డైరెక్టర్ జనరల్, ఐఆర్ఎస్ అధికారి ఆనంద్ రాజేశ్వరీ బెహర్ కుటుంబసభ్యులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఈవో సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనం అందజేయగా ఈవో ప్రసాదం అందించారు. అలాగే రాజమండ్రి జాయింట్ కలెక్టర్ కె.రాములు స్వామివారిని దర్శించుకున్నారు.

బాలబాలాజీ దేవస్థానం ఈవోగా సత్యనారాయణరాజు


సత్యనారాయణరాజు

మామిడికుదురు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానం ఈవోగా ఎం.సత్యనారాయణరాజు శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఆయన 94 రోజులు వ్యక్తిగత సెలవుపై విదేశాలకు వెళ్లి తిరిగి శనివారం విధుల్లో చేరారు. ఇప్పటి వరకు జిల్లా దేవదాయశాఖ అధికారి వి.సత్యనారాయణ తాత్కాలిక ఈవోగా వ్యవహరించారు. ఆయనకు ఆలయ సిబ్బంది మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు.


తిరుచ్చివాహనంపై విహరిస్తున్న స్వామి,అమ్మవార్లు

సత్యదేవుడికి తిరుచ్చిసేవ

అన్నవరం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడికి శనివారం తిరుచ్చిసేవ వేడుకగా జరిగింది. ఉదయం 10గంటలకు స్వామి,అమ్మవార్లను ప్రధానాలయం నుంచి తిరుచ్చివాహనంపై ఆశీనులు గావించి తూర్పురాజగోపురం వద్దకు తోడ్కొని వచ్చారు. ప్రత్యేక పూజలు అనంతరం భక్తుల గోవిందనామస్మరణలు, మేళతాలాలతో ముమ్మారు ప్రదక్షిణ గావించారు. అనంతరం హారతులిచ్చి ప్రధానాలయానికి తీసుకెళ్లారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళాలు

అన్నవరం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి శనివారం ఇద్దల దాతల నుంచి రూ.2 లక్షలు విరాళాలుగా సమకూరాయి. విశాఖపట్నంకు చెందిన మద్ది శ్రీనివాసరావు రూ 1,00,116, విజయవాడకు చెందిన పిల్లా అమర్నాధ్, అపర్ణ దంపతులు రూ.1,01,116 విరాళాన్ని ఈవో సుబ్బారావుకు శనివారం అందజేశారు. దాతలను ఆయన అభినందించి స్వామివారి ప్రసాదం,ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించారు.


విరాళం అందజేస్తున్న దాత అమర్నాథ్

రూల్స్ పాటించని ప్రైవేట్ బస్సులు

రూ.1.93 లక్షల అపరాధ రుసుం

రావులపాలెం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం ఈతకోట వద్ద జాతీయ రహదారిపై ఈతకోట టోల్‌ప్లాజా వద్ద జిల్లా రవాణా అధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు ప్రైవేట్ బస్సులను శనివారం తనిఖీ చేశారు. 20బస్సులు రికార్డులను పరిశీలించగా నిబంధనలకు విరుద్ధంగా ఉండడంతో నిర్వాహకుల నుంచి రూ.1,93,600 అపరాధ రుసుంగా వసూలు చేశారు. దీనిలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఒక ప్రైవేట్ బస్సును సీజ్ చేసి రూ.1,22,000 పన్ను, అపరాధ రుసుం వసూళ్లు చేశామని ఆయన తెలిపారు. ఈ ప్రత్యేక తనిఖీలు ప్రతీ వారం నిర్వహిస్తున్నామని, రహదారి భద్రతా నియమాలను ప్రతీ ఒక్కరు పాటించాలన్నారు. ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చాలని, అదే విధంగా వారితో మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు.

ఆంధ్రా రంజీ మాజీ క్రికెట్ ప్లేయర్ శ్రీరామచందర్‌మూర్తి మృతికి సంతాపం


శ్రీరామచందర్ మూర్తి (ఫైల్)

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా రంజీ మాజీ క్రికెట్ ప్లేయర్ మంతెన శ్రీరామచందర్‌మూర్తి మృతికి ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ సానా సతీష్ బాబు, తూర్పుగోదావరి జిల్లా డిస్ట్రిక్ అసోసియేషన్ శనివారం ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా డిస్ట్రిక్ అసోసియేషన్ సెక్రటరీ వెంకటేష్ మాట్లాడుతూ మంతెన శ్రీరామచందర్‌మూర్తి హైదరాబాద్ అండర్-19 స్కూల్స్ టీం, సౌత్‌జోన్ స్కూల్స్ టీం, అండర్ 25 క్రికెట్ మ్యాచ్‌లు హైదరాబాద్ తరుపున ఆడి కాకినాడ ఇంజనీరింగ్ కాలేజీ నుంచి డిగ్రీ పూర్తి చేశారని తెలిపారు. అలాగే ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ తరుపున జూనియర్ స్టేట్, రంజీ ట్రోఫీ, సౌత్ జోన్ యూనివర్సిటీస్‌కు ప్రాతినిధ్యం వహించారన్నారు. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఆయన తూర్పుగోదావరిజిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా కూడా విధులు నిర్వహించారని తెలిపారు. ఆయన మృతి క్రికెట్ సర్కిల్‌లో విషాదం నింపిందన్నారు.

కొమ్మ కొమ్మకో..!



కొమ్మ కొమ్మకు స్టీల్, సిల్వర్ పాత్రలు ఉన్నాయి ఏమిటీ అనుకుంటున్నారా.. అల్లూరి జిల్లా చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో దబ్బగూడెం గ్రామంలోని ఓ ఇంటి పెరట్లో ఎండిన చెట్టును ఓ గిరిజనుడు ఇలా మలిచాడు. కడిగిన వంట పాత్రలను ఇలా ఎండిపోయిన చెట్టు కొమ్మలకు తగిలిస్తూ సమయాన్ని ఆదా చేస్తున్నాడు. ఈ దృశ్యాన్ని ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్ మనిపించిందిలా.

– మోతుగూడెం (ఆంధ్రజ్యోతి)

రోడ్డుమార్గంలో విజయవాడకు మంత్రి నాదెండ్ల

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పర్యటన ముగించుకుని ఏపీ పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ శనివారం ఉదయం 9గంటలకు విజయవాడకు రోడ్డుమార్గంలో బయలుదేరి వెళ్లారు. కాకినాడ జీఆర్‌టీ హోటల్‌లో ఉదయం కొంతమంది జనసేన నాయకులు, కార్యకర్తలు ఆయన్ని మర్యాదపూర్వకంగా కలిసి జిల్లాలో పరిస్థితులను వివరించారు.

కార్యకర్తల సంక్షేమమే ధ్యేయం: ఎమ్మెల్యే నానాజీ



బాధితురాలికి రూ.5లక్షల చెక్కునందిస్తున్న ఎమ్మెల్యే నానాజీ

కరప, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): కార్యకర్తల సంక్షేమమే జనసేనపార్టీ ధ్యేయమని ఎమ్మెల్యే పంతం నానాజీ పేర్కొన్నారు. కరపమండలం కూరాడ గ్రామంలో శనివారం సాయంత్రం ఆయన పర్యటించి గత ఏడాది సెప్టెంబరు 10వ తేదీన పాము కాటుతో మృతిచెందిన జనసేనపార్టీ క్రియాశీలక సభ్యుడు కాకర్ల నారాయణమూర్తి కుటుంబసభ్యులను పరామర్శించారు. అతని భార్య సత్యవతికి ప్రమాద బీమా కింద రూ.5లక్షల చెక్కును అందజేసి అన్నివిధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలో సమస్యలపై స్థానిక నాయకులతో చర్చించారు. జనసేనపార్టీ మండలాధ్యక్షుడు బండారు మురళి, కూరాడ, వేములవాడ సొసైటీ చైర్మన్‌లు వెలుగుబంట్ల సూరిబాబు, దూడల నారాయుడు, బోగిరెడ్డి కొండబాబు, గంగాధర్, సాయిరామ్, వెలుగుబంట్ల గంగాధర్, చోడిశెట్టి ప్రసాద్ పాల్గొన్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌లో 122 కేసుల పరిష్కారం



జాతీయ లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న అదనపు జిల్లా జడ్జి శ్రీహరి

పిఠాపురం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలోని కోర్టుల ప్రాంగణంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 122 కేసులు పరిష్కారమయ్యాయి. 12వ అదనపు జిల్లా జడ్జి ఎం.శ్రీహరి, సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి విజయరామేశ్వరీ నేతృత్వంలోని మూడు బెంచీల ముందుకు కేసులు వచ్చాయి. ఇందులో ఎంవీఓపీ కేసులు 12, అడ్మిషన్ కేసులు 52, బ్యాంకు పీఎల్‌సీ1, సివిల్ 23, క్రిమినల్ 25, ఎన్‌ఐ యాక్టు 3, ఎస్‌టీసీ 1, ఎక్సైజు కేసులు 5 పరిష్కరించారు. అదాలత్‌లో న్యాయవాదులు ఏఐ పాషా, ఎం.సత్యవాణిశ్రీ, డి.రమేష్‌బాబు, ఏపీపీ బత్తిన లక్ష్మణదొర, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేరుగు రాజారావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన వైద్యులతోనే చికిత్స చేయించుకోవాలి

● మాతృ మరణాలపై సమీక్ష

జీజీహెచ్(కాకినాడ) సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) మాతృమరణాలను అరికట్టేందుకు చేపట్టాల్సిన అవగాహన కార్యక్రమాలు గురించి జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయ సమావేశ మందిరంలో డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ శనివారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు అందజేయాల్సిన వైద్యసేవలు గురించి క్షేత్రస్థాయి సిబ్బందికి వివరించారు. అర్హత కలిగిన వైద్య సిబ్బందితో మాత్రమే వైద్య సహాయం పొందాలని అలాగే సొంత నిర్ణయంతో మందులు తీసుకోకూడదని సూచించారు. ఈఏడాది జూలై ఆగస్టు నెలల్లో సంభవించిన మాతృమరణాలకు గల కారణాలను ఆరా తీశారు. గర్భిణులు, బాలింతల ఆరోగ్య సమాచారాన్ని క్షేత్రస్థాయిలో ఆశాలు ఎప్పటికప్పుడు వైద్యఆరోగ్యశాఖ సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి డాక్టర్ రమాదేవి, వైద్యాధికారులు, ఎంసీహెచ్ సిబ్బంది, ఏఎన్ ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ నాయక్

చేబ్రోలులో రైతుల రాస్తారోకో

• యూరియా కూపన్లు పక్కదోవ పట్టడంపై ఆగ్రహం • సొసైటీ వద్ద తోపులాట, ఉద్రిక్తత

యూరియా పంపిణీ కోసం సిద్ధం చేసిన కూపన్లు పక్కదోవ పట్టడం గొల్లప్రోలు మండలం చేబ్రోలులో ఆందోళనలు, ఉద్రిక్తతలకు దారితీసింది. సొసైటీ వద్ద రైతుల మధ్య వాగ్వాదాలు, తోపులాటలు చోటుచేసుకున్నాయి. కూపన్లు అందకపోవడంతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.



గొల్లప్రోలు మండలం చేబ్రోలులో రాస్తారోకో నిర్వహిస్తున్న రైతులు

గొల్లప్రోలురూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం చేబ్రోలు సొసైటీకి 450 బస్తాల యూరియా వస్తున్నట్లు సమాచారం అందడంతో శనివారం తెల్లవారు జాము నుంచి రైతులు బారులు తీరారు. భారీ సంఖ్యలో రైతులు సొసైటీవద్ద కూపన్ల కోసం వేచి ఉన్నారు. ముందుగా కూపన్లు ఇచ్చి దా ని ప్రకారం యూరియా పంపిణీ చేస్తామని అధికారులు ప్రకటించారు. ఈ క్రమంలో కూ పన్లు కొంతమందికి ఇచ్చిన తర్వాత సొసైటీ సిబ్బంది వద్ద ఉన్న కూపన్లను ఒక నాయకుడు తీసుకుని వాటిని తమ వారికి పంచేసినట్లు ఆరోపిస్తూ రైతులు ఆందోళనకు దిగారు. అదే సమయంలో రైతుల మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకున్నాయి. అధికారులు, సొసైటీ సిబ్బంది తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ రైతులు గ్రామంలోని ఆర్‌అండ్‌బీ రహదారిపై రాస్తారోకో చేపట్టా రు. వీరికి గొల్లప్రోలు జడ్పీటీసీ ఉలవకాయల నాగలోవరాజు తదితరులు సంఘీభావం తెలిపారు. వీరి ఆందోళనతో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. గొల్లప్రోలు ఎస్‌ఐ రామకృష్ణ, పోలీసులు అక్కడకు చేరుకుని ఆందోళనకారులను అక్కడి నుంచి తరలించారు. వ్యవసాయశాఖ ఏడీ పి.స్వాతి రైతులతో చర్చలు జరిపారు. రైతులందరికీ కూపన్లు అందజేస్తామని ప్రకటించడంతో ఆందోళన విరమించారు. అనంతరం మరో200 కూపన్లు రైతులకు అందజేశారు. వీరికి యూరియా పంపి ణీ చేస్తామని అధికారులు తెలిపారు. కాగా సొసైటీలో యూరియా కూపన్లు పక్కదోవ పట్టిన వ్యవహారంపై జిల్లా సహకార శాఖాధికారి శ్రీనివాసరెడ్డి విచారణ చేపట్టారు. సొసైటీ సిబ్బంది తీరుపై పలువురు ఫిర్యాదు చేశారు. యూరియాను ఇక నుంచి బయోమెట్రిక్ ఆదారంగానే పంపిణీ చేస్తామని, రైతులు తప్పనిసరిగా ఆధార్‌కార్డు, పాస్‌బుక్ తీసుకురావాలని ఏడీ స్వాతి, వ్యవసాయాధికారి సత్యనారాయణ తెలిపారు.

కోడిపందేలపై పోలీసుల దాడి

కరప, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): కరప మండలం వేములవాడ శివారు సిరిగలపల్లి లంక గ్రామంలో జరుగుతున్న కోడిపందేలపై శనివారం పోలీసులు దాడిచేసి 12మంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.21,200ల నగదు, నాలుగు కోడిపుంజులు, నాలుగు కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు కరప ఎస్‌ఐ తోట సునీత తెలిపారు

భారీ అన్నసమారాధన

కొత్తపల్లి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాల ను పునస్కరించుకొని కొత్తపల్లి మండలం కుతుకుడుమిల్లి గ్రామంలో జై గణేష్‌యూత్ ఆధ్వర్యంలో శనివారంభారీ అన్నసమారాధన నిర్వహించారు. కుతుకుడుమిల్లి పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు అన్నసవరాధనలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు.

గాంధీనగర్‌లో..

కాకినాడసిటీ, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా స్థానిక గాంధీనగర్ పూళ్లవారివీధిలో వరసిద్ధి వినాయక ఉత్సవకమిటీ ఆధ్వర్యంలో శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహిచారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఉభయ ఉమ్మడి గోదావరిజిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్యే పేరాబత్తుల రాజశేఖర్ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమాన్ని ఉత్సవకమిటీ సభ్యులు గోడి వెంకట్, స్వప్నషౌధ చంద్రశేఖర్, అడపా బద్రీనాధ్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ చిత్ర బృందం ఆధ్వర్యంలో సంగీత విభావరి భక్తిపాటలు ఆలపించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు యెనిమిరెడ్డి మాలకొండయ్య, దువ్వూరి సుబ్రహ్మణ్యం, కందాల రవి, మాజీ కౌన్సిలర్ జీవీఎస్ శర్మ, మాజీ కార్పొరేటర్ గోడి సత్యవతి, వార్డు నాయకులు వాసిరెడ్డి కుమార్, చలపతి, పిల్లి సత్తిబాబు, శ్రీరాములు, రామకృష్ణ పాల్గొన్నారు.

కొనసాగిన యోగా తరగతులు

నేడు శాంభవి మహాముద్రపై శిక్షణ

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ గాంధీభవన్‌లో గత నాలుగురోజులుగా ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇన్నర్ ఇంజినీరింగ్‌పై ప్రత్యేక యోగా శిక్షణా తరగతులు జరగు తున్నాయి. శనివారం కూడా కోయంబత్తూరు నుంచి సద్గురు జగ్గీవాసుదేవ్ ప్రత్యక్ష ప్రచారం ద్వారా యోగా తరగతులు జరిగాయి. ఆదివారం ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ప్రత్యేక యోగా కార్యక్రమం జరుగుతుంది. ప్రధానంగా శాంభవి మహాముద్రపై శిక్షణ ఇస్తారు. శాంభవి మహా ముద్ర ఒత్తిడి, నిరాశను నియంత్రించి మనస్సును ప్రశాంతంగా ఉంచుతుందని నిర్వాహకులు తెలిపారు. లోతైన అంతర్గత అనుభూతిని అందిస్తుందనీ, జీవనశక్తిని పెంచుతుందని పేర్కొన్నారు. ఈ ఆసనం జీవితాన్ని అద్భుతంగా మార్చుతుందని తెలిపారు. ఈనెల 16వ తేదీతో ఈ తరగతులు ముగుస్తున్నాయి. కాకినాడ సెంటర్ కోఆర్డినేటర్ సాగర్, ఇతర వలంటీర్ల బృందం పాల్గొన్నారు.



కాకినాడ గాంధీభవన్‌లో నిర్వహిస్తున్న యోగా తరగతులు

పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయకార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు ఈశ్వరరావు

కరప, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ శ్రామికులకు పెండింగ్ వేతనాలు వెంటనే విడుదలచేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టేకుమూడి ఈశ్వరరావు, కెఎస్ శ్రీనివాస్‌లు డిమాండ్ చేశారు. కరపలో శనివారం ఉపాధి శ్రామికులతో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మా ట్లాడారు. ఉపాధిహామీ పథకంలో చేసిన పనికి గత మూడు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. చేసిన పనికి 15రోజుల్లోగా వేతనాలు ఇవ్వాలని ఉపాధి హామీ చట్టంలో ఉందని, అయితే మూడు నెలల దాటినా ఇంతవరకు వేతనాలు విడుదల చేయకపోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి ఏమిటో స్పష్టమవుతుందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బకాయి వేతనాలు వెంటనే విడుదలచేసి శ్రామికుల ఇబ్బందులను పరిష్కరించాలని, లేకపోతే ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

వాకతిప్పలో 200 మందికి వైద్య పరీక్షలు



వాకతిప్పలో వైద్యపరీక్షలు చేయించుకుంటున్న వృద్ధుడు

కొత్తపల్లి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం వాకతిప్ప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పార్టీలకు అతీతంగా విశాఖపట్నం అపోలో ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో క్యాన్సర్, గర్భిణులు, చిన్నపిల్లలకు సుమారు 200 మంది ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. ఆదివారం కూడా ఉచితంగా పరీక్షలు చేస్తారని, గ్రామస్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అపోలో వైద్య సిబ్బంది విజ్ఞప్తి చేశారు.

టీడీపీ అధ్యక్షుడిని కలిసిన దళిత నేతలు

తాళ్లరేవు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన మండలం తెలుగుదేశం పార్టీకి నూతన మండలాధ్యక్షుడిగా చెల్లి సురేష్ ఎంపికైన సందర్భంగా తాళ్లరేవు టీడీపీ మండల దళితనేతలు శనివారం కలిసి మర్యాదపూర్వకంగా అభినందనలు తెలిపారు. తెలుగుదేశం పార్టీలో ఉన్న దళితనేతలకు అండగా ఉండాలని దళితుల సమస్యలు అధిష్టానం దృష్టికి తీసుకు వెళ్లాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ దళితనేతలు జక్కల ప్రసాద్‌బాబు, వస్కారెడ్డి, మోర్త భైరవమూర్తి, దున్నా మురళి, దున్నా ఎల్లారావు, గంటా గోపిలు ఉన్నారు.



కాట్రేనికోన టీడీపీ మండలాధ్యక్షుడిని అభినందిస్తున్న తాళ్లరేవు దళితనేతలు

'ఆదిత్య'లో హిందీ దివస్



కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రవికిరణ్

కాకినాడ రూరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల్లో భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ మై భారత్, నవయువ భారతీయులు యువజన సంఘం ఆధ్వర్యంలో హిందీ దివస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థినిలకు హిందీలో వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.కరుణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పి.రవికిరణ్ మాట్లాడుతూ 1949 సెప్టెంబరు 14న రాజ్యాంగ అధికరణ 343ని భారత రాజ్యాంగంలో ప్రవేశ పెట్టినప్పటి రాజ్యాంగ సభ హిందీని అధికార భాషగా ప్రకటించిందని దీంతో ఆరోజున హిందీ దివస్ జరుపుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నాగశ్రీనాథ్, అధ్యాపకులు ఆనందరావు, విద్యార్థినిలు, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు

● వెటర్నరీ ఏడీ సురేష్‌బాబు



ఏడీ సురేష్‌బాబు

కరప, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం కింద ఈనెల 15వ తేదీ నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకు పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ యస్‌జేయస్ సురేష్‌బాబు తెలిపారు. కరపలో శనివారం ఆయన మాట్లాడుతూ దీనికోసం కాకినాడరూరల్ నియోజకవర్గంలో ఐదు బృందాలను ఏర్పాటుచేశామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 18,850 పశువులకు ఈ గాలికుంటు వ్యాధి టీకాలు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. గాలికుంటు వ్యాధి సోకిన పశువుల్లో పాల ఉత్పత్తి సామర్థ్యం గణనీయంగా తగ్గిపోవడంతో బాటు అశ్రద్ధ చేస్తే మరణాలు సంభవిస్తాయన్నారు. ఆరోగ్యంగా ఉండి నాలుగు నెలల వయసు పైబడిన అన్ని ఆవు, గేదె జాతి పశువులకు ఈ టీకాలు వేయించాలని పశుపోషకాలకు సూచించారు. 4నుంచి 8 నెలల లేగ దూడలకు నెలరోజుల వ్యవధిలో మరోసారి బూస్టర్ డోస్ వేయించుకుంటే వాటిలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అన్ని గ్రామాల పాడిరైతులు నిర్దేశిత తేదీల్లో తప్పనిసరిగా ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏడీ సురేష్‌బాబు సూచించారు. పశువైద్యాధికారులు ఎం.రవికిరణ్ బాబు, డి.రవికుమార్, రామచంద్రరావు, యం.రాజ్యలక్ష్మి, టీవీ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహార సరుకుల అందజేత



గర్భిణులకు పౌష్టికాహార సరుకులు అందజేస్తున్న డివిజన్ ఇన్‌చార్జి చిన్ని

కాకినాడ సిటీ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఆదేశాల మేరకు స్థానిక జగన్నాధపురం 25వ డివిజన్ సచివాలయం బి పరిధిలో గల 78వ నంబర్ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం గర్భిణులకు పౌషిక్టాహార సరుకులను నగర టీడీపీ ఉపాధ్యక్షుడు, డివిజన్ ఇన్‌చార్జి మేడిశెట్టి ఈశ్వరరావు (చిన్ని) అంద జేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ డీవీవీ రమణ. ఆయా ఆదిలక్ష్మి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

16రోజుల పాటు సేవా కార్యక్రమాలు

గొల్లప్రోలు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ 75వ పుట్టినరోజు సందర్భంగా ఈనెల 17వ తేదీ నుంచి అక్టోబరు 2వ తేదీ వరకూ 16రోజుల పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని గొల్లప్రోలు పట్టణ బీజేపీ అధ్యక్షుడు చిట్టా మధు, బీజేపీ సీనియర్ నాయకుడు డీవీఎస్ రాజు, జిల్లా కార్యదర్శి సైతన సత్యకుమారిలు సూచించారు. గొల్లప్రోలులోని బీజేపీ కార్యాలయంలో శనివారం సేవా పక్వాడా వర్క్‌షాపు నిర్వహించారు. సేవా కార్యక్రమాల నిర్వహణపై నాయకులు వివరించారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు అడబాల మోహనరావు, కార్యక్రమం ఇన్‌చార్జి ఆదుమళ్ల కల్యాణ్, మేడసాని కామరాజు, చీపూరి భాస్కరరావు, ఈపూరి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ సమావేశంలో మాట్లాడుతున్న పట్టణ అధ్యక్షుడు చిట్టా మధు



ప్రత్యేక అలంకరణలో శృంగారవల్లభస్వామి

తొలి తిరుపతికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం, సెప్టెంబర్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొలి తిరుపతి శృంగార వల్లభస్వామి క్షేత్రానికి శనివారం సుమారు 10వేల మంది కిపైగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివా రికి అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రూ.2,93,822 ఆదాయం లభించినట్లు ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు.

దేవస్థానం ధర్మకర్తల మండలి నియామకం

మండలంలోని తిరుపతి శృంగార వల్లభస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి నియామకం పూర్తయింది. పది మంది సభ్యులతో కమిటీని నియమిస్తూ దేవదాయశాఖ కమిషనర్ కార్యాలయం నుంచి శుక్రవారం సాయంత్రం జీవో ఆర్టీ నెం.1060 జారీ అయిఒది. సభ్యులుగా మొయిళ్ల సంధ్య, వంకా మహేష్, చిట్టూరి వీరవెంకటదుర్గా శివబాబు, జట్ల రాంబాబు, లక్కరాజు రామకృష్ణ, సట్టాది తలుపులమ్మ, యం.దుర్గ, రాకుర్తి వెంకటలక్ష్మి, పెంట ఏసుకుమారి, ఎర్రవరపు భూలోకేశ్వరరావులను నియమించారు.

కాకినాడ జిల్లా గర్ల్స్ నూతన కమిటీ

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గర్ల్స్ కన్వెన్షన్ నూతన కమిటీను కాకినాడ బీసీ బాలికల వసతి గృహంలో శనివారం ఎన్నుకున్నారు. కోగర్ల్స్ కన్వీనర్లుగా అమృత, తేజశ్రీ, బిందులు ఎన్నికైనారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ కన్వీనర్ పావని మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యాచారాలను అరికట్టేందుకు మహిళా చట్టాలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. అశ్లీల చిత్రాలను పూర్తిగా బ్యాన్ చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బాలికల వసతి గృహాల్లో శానిటరీ న్యాప్కిన్లు ఇవ్వాలన్నారు.

నేడు జిల్లాస్థాయి యోగాసన పోటీలు

పిఠాపురం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్, కాకినాడ జిల్లా యోగా అసోసియేషన్ల ఆధ్వర్యంలో పిఠాపురంలోని రథాలపేట సెంటర్‌లో గల అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం జిల్లాస్థాయి యోగాసన పోటీలు జరుగనున్నాయి. 8నుంచి 60 సంవత్సరాల వయస్సు కలిగిన విద్యార్థిని, విద్యార్థులు, పురుషులు, మహిళలకు వేర్వేరుగా పోటీలు జరుగుతాయి. ఉదయం 7.30గంటలకు ప్రారంభమయ్యే ఈ పోటీలు సాయంత్రం వరకూ జరుగుతాయి. పోటీల్లో పాల్గొనే వారికి భోజన, వసతి సదుపాయాలు కల్పించారు. ఈ పోటీల్లో చూపే ప్రతిభ ఆధారంగా అక్టోబరు 25, 26వ తేదీల్లో విశాఖపట్టణంలో జరిగే రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికలు నిర్వహిస్తారు. విశాఖలో ప్రతిభ చూపిన వారిని గుంటూరుజిల్లా బాపట్లలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారు. ఈ పోటీలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశామని జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వనం వీరబాబు, డి.సత్యప్రియ, కోశాధికారి రమేష్ తెలిపారు.

'జీవనశైలి మార్పుతో మోకాళ్ల నొప్పులు నయం'

కాకినాడసిటీ, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన ఆహారం, వ్యాయామం వంటి జీవనశైలి మార్పుతో మోకాళ్ల నొప్పులు నయం అవుతాయని డాక్టర్ మాధవ్ నెక్కంటి పేర్కొన్నారు. స్థానిక రోటరీ క్లబ్ హాల్‌లో జరిగిన రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ సమావేశానికి క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ గోపినాథ్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో మోకాళ్ల నొప్పులు-వైద్యం అనే అంశంపై డాక్టర్ మాధవ్ ప్రసంగిస్తూ అనేక వైద్య సూచనలు అందించారు. మోకాళ్లకు బలాన్ని ఇచ్చే వ్యాయామం ముఖ్యంగా కండరాలను బలోపేతం చేసే విధంగా ఉండటంవల్ల ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. క్లబ్ కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్‌సాన, కోశాధికారి ఉదయ చక్రవర్తి, ముంజు లూరి విశ్వేశ్వరరావు, లంక సాయిబాబు, హరి హత్తకుమార్, మాజేటి పవన్, టేకుమూడి సూర్యనారాయణ, సత్తి రవిరెడ్డి, వై.ఉమామహేశ్వరరావు, కె.శ్రీధర్, ఎం.రవీంద్రనాథ్, రెడ్డికుమార్, చిరంజీవిరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా మరిడమ్మతల్లి ఉత్సవాలు



తాళ్లరేవు, సెప్టెంబరు 13 (ఆంధ్ర జ్యోతి): కోరింగ పంచాయతీ పరిధి సీతారామపురం గ్రామంలో ఉన్న శ్రీమరిడమ్మతల్లి ఉత్సవాలు శనివారం ఆలయకమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి భక్తులు పూజలుచేసి హోమం నిర్వహించారు. భక్తులు నూతన గరగలు మరిడమ్మ అమ్మవారికి బహూకరించారు. ఆలయకమిటీ చైర్మన్ టేకుమూడి లక్ష్మణరావు, కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఘనంగా అన్నసమారాధనలు

ప్రత్తిపాడు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): గణేష్ ఉత్సవాలు ముగింపు సందర్భంగా శనివారం ప్రత్తిపాడులో మండపాల వద్ద భారీ అన్నదానాలు నిర్వహించారు. వీడియో థియేటర్ సమీపంలోని గల ఆలయం వద్ద అన్నసమారాధనలో 5వేలమంది భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు. మసీదు వీధిలో గల వినాయక మండపం వద్ద గల అన్నదానం నిర్వహించారు.



రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

యువతకు 'ఉపాధి' కల్పించేందుకు చర్యలు

- రంపచోడవరం ఐటీడీఏ నూతన పీవో స్మరణ్‌రాజ్



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్

రంపచోడవరం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ సెక్టార్లలో ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్య లు చేపట్టామని ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్ అన్నారు. స్థానిక భాను సప్లయి కంపెనీలో అంబుజా స్కిల్ డెవలప్‌మెంట్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అధ్వర్యంలో గిరిజన యువతీ, యువకులకు కుట్టుమిషన్, కంప్యూటర్, ఏసీ రిపేర్లు, తదితర వాటిపై శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా శిక్షణ పొంది వివిధ ఉద్యోగాలకు ఎంపికైన వారిని అభినందించారు. అంబుజా ఫౌండేషన్ ప్రతినిధులు శ్రీకాంత్, తులసీరామ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రతినిధులు టీ.మురళీకృష్ణ, జ్యోతి పాల్గొన్నారు.

నేడు 'జార్ఖండ్' టీమ్ సందర్శన

దేవీపట్నం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జార్ఖండ్ రాష్ట్రం నుంచి ది సోమ్ ట్రైబల్ లీడర్స్ జాతీయ పరిశోధనా టీమ్ పెద్దభీంపల్లి 2, ఆర్అండ్ఆర్ కాలనీ పెద్దభీంపల్లి 3, కొండ మొదలు కాలనీని ఆదివారం సందర్శిస్తుందని ఏపీ ఆదివాసీ జేఏసీ వైస్ చైర్మన్ తెల్లం శేఖర్, ఎస్.మురళి తెలిపారు. ఈ టీం 2013 కొత్త భూసేకరణ చట్టం ప్రకారం శాస్త్రీయ సమగ్ర పునరావాసం నిబంధనల ప్రకారం ప్రజలందరికీ ప్రభుత్వం నుంచి న్యాయబద్ధంగా అందాల్సినవి అందున్నాయో లేదో తెలుసుకుంటారన్నారు. అలాగే 15న తున్నూరును సందర్శిస్తారన్నారు. తర్వాత రంపచోడవరం ఐటీడీఏ పీవోను కలిసి ఆదివాసీల సమస్యలపై చర్చిస్తారని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

మోతుగూడెం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): లోయరు సీలేరు ప్రాజెక్టులో కాంట్రాక్టు కార్మికుల దీర్ఘకాల సమస్యలను పరిష్కరించాలని తెలుగునాడు విద్యుత్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకులు సీలేరు కాంప్లెక్స్ ముఖ్య ఇంజనీర్ చిన కామేశ్వరరావును కోరారు. ఈ మేరకు ఆయనకు డిమాండ్ నోటీసు అందజేశారు. ఏపీ జెన్‌కోలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికును సంస్థలో విలీనం చేసి నేరుగా సంస్థ వేతనాలు చెల్లించాలని, సమాన పనికి, సమాన వేతనం ఇవ్వాలని, రెండు,మూడు దశాబ్ధాలుగా ఏపీ జెన్‌కోలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. తెలుగునాడు విద్యుత్ కాంట్రాక్టర్ కార్మిక సంఘం బి- 1245 అనుబబంధ సంస్థ అధ్యక్షులు పాసి సతీష్‌బాబు, కార్యదర్శి దొడ్డి మల్లేష్, సహాయ కార్యదర్శి మడకం సుశీలలక్ష్మి, రీజనల్ సెక్రటరీ రత్నం, కిరణ్, పాండ్యాన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారిత సమావేశానికి ఎమ్మెల్యే

రంపచోడవరం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఈనెల 14,15 తేదీల్లో నిర్వహించే మహిళా సాధికారిత జాతీయ సమావేశాలకు ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ మిరియాల శిరీషదేవి హాజరుకానున్నట్టు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి. పార్లమెంటరీ, శాసనసభ కమిటీల మొదటి జాతీయ సమావేశానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయు డుతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మంత్రులు, గవర్నర్, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్, లోక్‌సభ స్పీకర్, తదితరులు హాజరవు తారన్నారు. సమావేశంలో ఆదివాసీ ప్రాంతాల మహిళా సాధికారితపై నెలకొన్న పలు మహిళా సమస్యలపై చర్చించనున్నట్టు తెలిపారు.

బ్యాక్ వాటర్ వచ్చే వరకు ఆ భూములపై రైతులకే హక్కు

ఎటపాక, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యి పంట పొలాల్లోకి బ్యాక్ వాటర్ వచ్చే వరకు ఆ ముంపు భూములు సంబంధిత రైతులకే చెందుతాయని అఖిలపక్ష నాయకులు దొంతు మంగేశ్వరరావు, పాయం వెంకయ్య అన్నారు. శనివారం నందిగామలో పోలవరం ముంపు భూముల రైతులతో కలిసి అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాటాడుతూ.. నందిగామ, మురుమూరు గ్రామాల్లో గత రెండునెలల కాలంగా ఓ పార్టీకి చెందిన కొందరు నాయకులు దౌర్జన్యంగా ఆదివాసీ జెండాలు పాతి, భూములను లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని, దీంతో ఆ భూముల గల రైతులు ఆందోళనకు గురవుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు పెనుబల్లి సాయిబాబు, మాచినేని రాజేష్, గూడపర్తి నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

డొంకరాయి ఎస్ఐ వెంకయ్య బాధ్యతల స్వీకరణ

మోతుగూడెం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): డొంకరాయి ఎస్ఐగా ఎస్. వెంకయ్య శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన శివకుమార్ రాజవొమ్మంగి ఎస్ఐగా బదిలీ అయ్యారు. గుర్తేడు ఎస్ఐగా పనిచేస్తున్న వెంకయ్యను డొంకరాయి ఎస్ఐగా నియమించారు.

ఏపీ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పెద్దిరాజు

రాజవొమ్మంగి సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా మండలానికి చెందిన గొల్లపూడి పెద్దిరాజును నియమిస్తూ కూటమి ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన ప్రస్తుతం లబ్బర్తి ఎంపీటీసీగా, రాజవొమ్మంగి మండల టీడీపీ అధ్యక్షుడిగా ఉన్నారు. ఈయన భార్య గొల్లపూడి లక్ష్మీదుర్గ బరదనాంపల్లి సర్పంచ్‌గా, ఆయన సోదరి గొల్లపూడి రమణి రాజవొమ్మంగి సర్పంచ్‌గా ఉన్నారు. పెద్దిరాజుకు రాష్ట్ర స్థాయి పదవి లభించడంపై మండల టీడీపీ నేతలు సంతోషం వ్యక్తం చేశారు. ప్రజలు, అధికారులు శుభాకాంక్షలు తెలియజేశారు.


నేడు ఆత్మీయ సన్మాన సభ

దేవీపట్నం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఇందుకూరులో డిప్యూటీ రిజిస్ట్రార్, ఏకేఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సీదారి రామమ్మూర్తికి ఆత్మీయ సన్మాన కార్యక్రమం ఆదివారం కొండదొర కుటుంబ సభ్యులు నిర్వహించనున్నారు. ఇందుకూరు నిక్‌ఫామ్ స్కూల్‌లో నిర్వహించే ఈ కార్యక్రమానికి కొండదొర కుటుంబీకులు, పెద్దలు తప్పనిసరిగా హాజరుకావాలని సన్మాన తాత్కాలిక కమిటీ సభ్యులు ఎరబండి నాగేశ్వరరావు, యలగాడ నాగేశ్వరరావు, బండి రమణ, రాజేష్, వై.ఆదినారాయణ, జగన్నాథరావు, తదితరులు కోరారు.

సైబర్ నేరాలపై అవగాహన

దేవీపట్నం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): చిన్నారిగండిలో శనివారం ఎస్ఐ షరీఫ్ గ్రామస్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణ, మహిళల చట్టాలు, మూఢనమ్మకాలు అరికట్టడం వంటి వాటిపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఎవరూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడరాదని సూచించారు.

మళ్లీ కొండచిలువ కలకలం



పొదలు తొలగిస్తున్న అటవీ సిబ్బంది

కూనవరం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): టేకులబోరులో కొండచిలువ శనివారం సైతం కలకలం రేపింది. ఇప్పటికే రెండురోజులుగా మకాం వేయగా, శనివారం ఉదయం మరోసారి ప్రత్యక్షమైంది. మళ్లీ పాదం ఆనంద్ ఇంటి వద్ద కనిపించడంతో కుటుంబసభ్యులు పరుగులు తీశారు. దీంతో చుట్టాపక్కల వారు సైతం వచ్చి చూడగానే అది మరలా పొదల్లోకి వెళ్లిపోయింది. దీంతో గ్రామస్థులు, అటవీ అధికారులకు సమాచారమివ్వడంతో వారు వచ్చి గాలింపు చర్యలు చేపట్టారు. అయినా కనిపించలేదు. దీంతో అటవీ సిబ్బంది చుట్టుపక్కల ఉన్న పొదలను తొలగించారు. కాగా ఆనంద్ కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల ఉంటున్న కాలనీ వాసులు భయాందోళన చెందుతున్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి



వరి పరిశోధన సంస్థ డైరెక్టర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న శ్రీప్రకాష్ విద్యాసంస్థల అధినేత

తుని రూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సవాళ్లను అధికమించేలా అవకాశాలను అందిపుచ్చుకోవాలని భారతీయ వరి పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ ఆర్.ఎం.సుందరం తెలిపారు. శ్రీప్రకాష్ అనుసంబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాలలో శనివారం విద్యార్థులకు యువ ప్రేరణ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా సుందరం మాట్లాడుతూ విద్యార్థులు మార్కుల కోసం కాకుండా జ్ఞాన సముపార్జనపై దృష్టి పెట్టాలన్నారు. కృత్రిమ మేథస్సుతో పనులు జరిగే రోజుల్లో మనం ఉన్నామని, మన ఆలోచనలు యాంత్రీకరణగా మిగిలిపోయే ప్రమాదం ఉందన్నారు. విద్యార్థులు పరీక్షల కోసం కాకుండా జీవిత లక్ష్య సాధన కోసం సిద్ధంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీప్రకాష్ విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, ప్రెసిడెంట్ డాక్టర్ కంటిపూడి నరేంద్రబాబు, సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్ అకడమిక్ క్యాలెండర్‌ను విడుదల చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎ.రామకృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

శిథిలావస్థలో మండల పరిషత్ కార్యాలయం



కార్యాలయంలో శ్లాబు పెచ్చులు ఊడిపోయిన దృశ్యం

కోటనందూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కోటనందూరు మండల పరిషత్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో అధికారులు, ప్రజలు బెంబేలెత్తుతున్నారు. మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన భవనం నేడు ఎప్పు డు కూలిపోతుందో అన్నట్టుగా ఉంది. శ్లాబు పెచ్చులు ఊడిపోయి అధికారులమీద పడిన సంఘటనలు ఉన్నాయి. ఉన్నతాధికారులు స్పందించి కొత్త భవనం నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

బీటలు వారిన స్తంభం తొలగింపు

కొత్త స్తంభం ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



రౌతులపూడి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రౌతులపూడి గ్రామశివారు ఏటికాలువ వంతెనకు కాస్తదూరంలో విద్యుత్ స్తంభం బీటలు వారి ప్రమాద కరంగా ఉంది. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో పొంచి ఉన్న పెను ప్రమాదం అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన విద్యుత్‌శాఖ ఏఈ గంపల చినబాబు స్పందించి సిబ్బందితో శనివారం బీటలు వారిన విద్యుత్ స్తంభాన్ని తొలగించారు. నూతన స్తంభం ఏర్పాటుచేసి విద్యుత్ తీగలను కలిపారు.

తునిలో జోరు వాన



తుని రూరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): శనివారం వేకువజాము నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో జనజీవనం స్తంభించింది. తుని పట్టణంలో డ్రైన్లు పొంగి పొర్లగా గ్రామీణ ప్రాంతాల్లో వాగులు, వంకలు వర్షం నీటితో పరుగులు తీశాయి. పలు చోట్ల ప్రత్తి, వరి మడులు నీట మునిగాయి.

రేపటి నుంచి గాలికుంటు నివారణ టీకాలు



డాక్టర్ తాతయ్య

జగ్గంపేట/గండేపల్లి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): జగ్గంపేట, గండేపల్లి మండలాల్లో ఈనెల15 నుంచి అక్టోబర్ 15వరకు రైతుల ఇంటికి వెళ్లి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు పశువులకు వేస్తామని జగ్గంపేట వెటర్నరి అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కె.తాతయ్య తెలిపారు. దీని కోసం పశుసంవర్ధక శాఖ అధ్వర్యంలో బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రతీ టీమ్ గ్రామంలోకి వచ్చేముందు రైతులకు సమాచారం ఇస్తారన్నారు. గాలికుంటు వ్యాధి సోకితే పశువుల ఉత్పాదక సామర్థ్యం తగ్గిపోతుందని, చూడు పశువులు చూడును వదిలి వేసే అవకాశం ఉందని, తద్వారా రైతు ఆర్థికంగా చాలా నష్టపోవలసి వస్తుందన్నారు. టీకాలు వేయడం వల్ల ఈవ్యాధిని అరికట్ట వచ్చన్నారు. పాడి రైతులు తప్పని సరిగా తమ పశువులకు టీకాలు వేయించాలని కోరారు.

జ్యోతుల నెహ్రూ, నవీన్‌కు సత్కారం





ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, నవీన్‌కుమార్‌ను సత్కరిస్తున్న వ్యాపారస్తులు

జగ్గంపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జ్యోతుల నెహ్రూ కాంప్లెక్స్‌లో ఉన్న 24మంది చిరు వ్యాపారస్తులందరూ స్థానిక రావులమ్మనగర్‌లో టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌ను ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. కాంప్లెక్స్‌లో ఉన్న అందరికీ పీ-4 ఆదరణ పథకం ద్వారా స్వయం ఉపాధి కల్పిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్‌వీఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, కొత్త కొండబాబు, వాసిరెడ్డి ఏసుదాసు, పాండ్రంగి రాంబాబు, దేవరపల్లి మూర్తి, పాలచర్ల నాగేంద్ర చౌదరి, రాయి సాయి, సత్తి సదాశి వరెడ్డి, గెద్దాడ సత్యవేణి, పీల మహేష్, సాంబత్తుల చంద్రశేఖర్, తుమ్మల కిషోర్, పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక: గోకవరం టౌన్‌లో గల పలువురు ముస్లింలు వైసీపీకి రాజీనామా చేసి తెలుగుదేశం పార్టీలో చేరారు. కృష్ణునిపాలెం గోపికృష్ణ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ముఖ్యఅతిథిగా హాజరై పార్టీలో చేరిన ముస్లింలకు టీడీపీ కండువాలు కప్పి సాదరస్వాగతం పలికారు. కార్యక్రమంలో గోకవరం సొసైటీ చైర్మన్ గాజింగం సత్తిబాబు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి గునిపే భరత్, మాజీ జడ్పీటీసీ పాలూరి బోసుబాబు, పోసిన ప్రసాద్ పాల్గొన్నారు.

భారీ అన్నదానం



కిర్లంపూడి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): కిర్లంపూడి సంతమార్కెట్‌లో లక్ష్మీగణపతి ఆలయం వద్ద శనివారం ఆలయ కమిటీ సభ్యులు భారీ అన్నదానం నిర్వహించారు. వైసీపీ నాయకుడు ముద్రగడ గిరిబాబు, టీడీపీ నాయకుడు తోట నవీన్ తదితరులు విచ్చేసి స్వామివారిని దర్శించుకుని అన్నదానంలో పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

దేవి నవరాత్రుల పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే

రౌతులపూడి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రౌతులపూడిలో ఈ నెల 22వ తేదీ నుంచి జరగనున్న దేవీ నవరాత్రుల కార్యక్రమాల పోస్టర్‌ను ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆవిష్కరించారు. పెదశంకర్లపూడి క్యాంపు కార్యాలయం వద్ద శ్రీనివాస వర్తక సంఘం అధ్యక్షుడు యడ్ల బుజ్జి సమక్షంలో ఎమ్మెల్యే పోస్టర్‌ను ఆవిష్కరించారు.



గొంది కొత్తపల్లిలో చెత్తను తొలగిస్తున్న దృశ్యం

కదిలిన యంత్రాంగం...తొలగిన చెత్త!

శంఖవరం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఎక్కడ చూసినా చెత్తకుప్పలే శీర్షికతో శనివారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి యంత్రాంగం కదిలింది. గొంది కొత్తపల్లిలో రహదారులపై పేరుకుపోయిన చెత్తను శనివారం సర్పంచ్ ఈగల విజయదుర్గ, పంచాయతీ అధికారుల ఆధ్వర్యంలో తొలగించారు. గ్రామాల్లో చెత్తను బయట వేయకుండా పంచాయతీ సిబ్బంది వచ్చినప్పుడు వారికి అందజేయాలని అధికారులు ప్రజలను కోరారు.



మంత్రి నాదెండ్లను కలిసిన బాబి

రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలి

శంఖవరం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): రైతులకు ఇబ్బందులు లేకుండా తమ ధాన్యాన్ని ప్రభుత్వానికి అమ్ముతున్నారని కొన్ని చోట్ల దళారులు తక్కువ దరకు ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఇబ్బందులు పెడుతున్నారని జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, ప్రత్తిపాడు నేత మేడిశెట్టి సూర్యకిరణ్(బాబి) మంత్రి నాదెండ్లకు వివరించారు. శనివారం కాకినాడలో ఆయన్ను కలిసి నియోజకవర్గ పరిస్థితులను తెలిపారు. మెట్ట ప్రాంతంలో పంటకు అంతంత మాత్రమే దిగుబడి వస్తుందని, దళారుల వల్ల రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలని కోరారు. ప్రోగ్రాం కమిటీ సభ్యులు కరణం సుబ్రహ్మణ్యం, మండలాధ్యక్షుడు గాబు సుభాష్, తలపంటి బుజ్జి తదితరులు ఉన్నారు.

ఆటో కార్మికులకు అండగా నిలుస్తాం



మాట్లాడుతున్న జ్యోతుల నవీన్‌కుమార్. వేదికపై నెహ్రూ

జగ్గంపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ఆటో డ్రైవర్లకు అండగా నిలుస్తామని జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు మెంబర్ జ్యోతుల నెహ్రూ అన్నారు. జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా ఆటో డ్రైవర్లకు ఉమ్మడి ఇన్సూరెన్స్ చేయిస్తానని టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ అన్నారు. గోకవరంలో ఆటో డ్రైవర్లకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో 25 కిలోల బియ్యం బ్యాగ్‌లను పంపిణీ చేశారు. జగ్గంపేట మార్కెట్ యార్డ్ చైర్మన్ భరత్ కుమార్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, సూరంపాలెం ప్రాజెక్ట్ చైర్మన్ ఉంగరాల రాము, గోకవరం మండల పిల్లా చంటిబాబు, జగ్గంపేట మండల కన్వీనర్ జీను మణిబాబు, గోకవరం సొసైటీ చైర్మన్ గాజింగం సత్తిబాబు, క్లస్టర్ ఇన్‌చార్జ్ కన్నబాబు, మండల ప్రధాన కార్యదర్శి గునిపే భరత్ పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 72 కేసులు పరిష్కారం

ప్రత్తిపాడు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో జడ్జి ఎల్.గోపీనాథ్ ఆధ్వర్యంలో 72 కేసులు పరిష్కారమయ్యాయి. వీటిలో క్రిమినల్ కేసులు 34 కాగా, సివిల్ కేసులు 8, పీఎల్‌సీ కేసులు 10, అడ్మినిస్ట్రేటివ్ కేసులు 20, ఎక్సైజ్ కేసులు 2 ఉన్నాయి. బ్యాంక్ సంబంధిత కేసులు పరిష్కారం కావడంతో అవార్డు కాపీని బ్యాంక్ సిబ్బందికి జడ్జి గోపినాథ్ అందజేశారు. ఎక్సైజ్ కేసులకు సంబంధించి రూ.11,500 చలానా రూపంలో వచ్చింది. లోక్ అదాలత్‌లో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు, లోక్ అదాలత్ బెంచ్ సభ్యులు కుసుమంచి సూర్యప్రకాష్, మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొల్లా వీర్రాజు, బుగతా శివ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు అండగా ఉంటాం



నెల్లిపూడిలో సహాయాన్ని అందిస్తున్న బుజ్జి

శంఖవరం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో అన్ని వర్గాలకు అండగా ఉంటామని జనసేన మండల ఉపాధ్యక్షుడు తలపంటి బుజ్జి అన్నారు. నెల్లిపూడిలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వారి కుటుంబాలకు శనివారం నగదుతో పాటు, 50 కిలోల బియ్యాన్ని అందించారు. కార్యక్రమంలో కోరాడ జాను, నొక్కే వీరబాబు, తలపంటి వీరబాబు, కె.గోవిందు, తలపంటి వెంకట్, పిర్ల నాని, జనసేన పలువురు వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను కలిసిన మత్స్య సహకార సంఘ సభ్యులు

జగ్గంపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గొల్లలకుంట మత్స్య సహకార సంఘం నూతన పాలకవర్గ సంఘ సభ్యులు తిరుమలరాజు మురళీరాజు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో ఎమ్మెల్యే జ్యోతులను కలిసి సత్కరించారు. మత్స్యకార సంఘం అధ్యక్షుడు బత్తిన రామకృష్ణ ఆధ్వర్యంలో పలువురు వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, దేవరపల్లి మూర్తి, గొల్లల గుంట టీడీపీ నాయకులు, రాయుడు వీరబాబు, కలిదిండి రాజశేఖర్, కులుకులూరి కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులర్ చేయాలి

ప్రత్తిపాడు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్ట్ లెక్చరర్ల రౌండ్ టేబుల్ సమావేశం విజయవాడలో శనివారం నిర్వహించారు. ప్రత్తిపాడుకు చెందిన కాంట్రాక్ట్ లెక్చరర్ల సంఘ కార్యదర్శి గొర్ల మాణిక్యం పాల్గొన్న ఈ సమావేశానికి ఉభయ గోదావరి జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ బి.గోపిమూర్తి ముఖ్య అతిథిగా విచ్చేసి కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 18న 36 మంది మహిళలతో 36 గంటల ధర్నా చేపట్టేందుకు భవిష్యత్ కార్యాచరణపై వారు చర్చించారు.

'ఆదిత్య'లో ముగిసిన వర్క్‌షాప్

గండేపల్లి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్శిటీలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో డేటా వాలీ సహకారంతో గూగుల్ ఫ్లట్టర్‌పై ఐదు రోజుల వర్క్‌షాప్ విజయవంతంగా నిర్వహించారు. మూడో సంవత్సరం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇంజనీరింగ్ విద్యార్థులు పాల్గొని మొబైల్ అప్లికేషన్ డెవలప్‌మెంట్‌లో ఉపయోగించే ఆధునిక సాంకేతికలపై అవగాహన పొందారు. అలాగే యూనివర్శిటీలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డు సారథ్యంలో స్టూడెంట్ ఎనేబుల్‌మెంట్ ప్రోగ్రాం నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్ ఫౌండేషన్ సర్టిఫికేషన్‌పై కార్యక్రమం నిర్వహించారు. ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డుకి విశేష సేవలందిస్తున్న ఐశ్వర్య రాజీవ్, పృథ్వీ బెంగళూరు ఆదిశేఖర్ ఆన్‌లైన్‌లో రిసోర్సుపర్సన్లుగా వ్యవహరించారు. 120మంది ఇంజనీరింగ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ముద్రగడకు పరామర్శ

కిర్లంపూడి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఇటీవల అనారోగ్యానికిగురై చికిత్స పొంది ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. దీంతో ఆయన్ను శనివారం మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, టీడీపీ నాయకులు తోట నవీన్, వైసీపీ నాయకులు దోమాల గంగాధర్, పెంటకోట నాగబాబు తదితరులు ముద్రగడను కలిసి ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు.

దళితుల ఆశాజ్యోతి చిట్టిబాబు

- దళిత నాయకులు



చిట్టిబాబు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దళిత నాయకులు

కిర్లంపూడి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): దళితుల ఆశాజ్యోతి గుడాల చిట్టిబాబు అని కిర్లంపూడి దళిత నాయకులు కొనియాడారు. కిర్లంపూడి ఎస్సీ పేటలో శనివారం చిట్టిబాబు 15వ వర్ధంతి నిర్వహించారు. ఆయన కుమారులు గుడాల రాంబాబు, వెంకటరత్నం బ్రదర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి దళిత పెద్దలు విచ్చేసి చిట్టిబాబు విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సాదే ఏసు, బంగారు సింహాచలం, కట్టు నాని, బులిపే గోపి, చుక్కా సుబ్బారావు, గుద్దాటి సోమరాజు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్తిపాడులో భారీ వర్షం

ప్రత్తిపాడు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో పల్లపు ప్రాంతాలు, పంట పొలాలు జలమయం అయ్యాయి.

ప్రత్తిపాడు-సామర్లకోట రోడ్డు అభివృద్ధి

ప్రత్తిపాడు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు-సామర్లకోట రహదారిని అభివృద్ధి చేయనున్నట్టు ఆర్అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11న అధ్వానంగా ప్రత్తిపాడు-కిర్లంపూడి రహదారి శీర్షికతో ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి స్పందించి రహదారి అభివృద్ధికి రూ.2కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. వర్షాలు తగ్గిన వెంటనే వాటి పనులు నిర్వహించనున్నట్టు చెప్పారు. రహదారి అభివృద్ధికి నిధులు మంజూరు కావడం పట్ల పీసీసీ సభ్యుడు ధర్నాల కోట శ్రీనుతో పాటు స్థానికులు ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

జగ్గంపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గండేపల్లి, జగ్గంపేట పోలీస్ స్టేషన్ల పరిధిలో పేకాడుతున్న 45 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారిని పెద్దాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరిచారు. ఒక్కొక్కరికి రూ.300 చొప్పున జరిమానా విధించినట్టు సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ తెలిపారు.